## అన్నవరం వాగుపై అప్రోచ్ బ్రిడ్జి రెండు సార్లు నిర్మాణం ఫలితం సున్యం

- ★ ప్రభుత్వ ధనం వృధా చేస్తున్నారు అంటున్న మండలం ప్రజలు
- ★అన్నవరం ఉమ్మడివరం మధ్య హైలెవల్ బ్రిడ్జి కాదు.
- ★ ఎప్పటిలాగే లో లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టిన ప్రభుత్వం.
- ★ మండలంలో అతి పెద్ద వాగుపై లో లెవల్ బ్రిడ్జి నిర్మాణం నిలువదు



**వి ఆర్ పురంమర్చి 26 వుదయం ప్రతినిధి:**
పోలవరం జిల్లా వి ఆర్ పురం మండలంలో అన్నవరం ఉమ్మడివరంమధ్య లో ఉన్న ప్రధాన వాగు పై ఉన్న బ్రిడ్జి కూలిపోయి సుమారు మూడు సంవత్సరాలు ఐయింది.మండలంలో 30 గ్రామాల ప్రజలకు బస్సు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు.సమస్యలు ఎదుర్కొన్నారు.ఎట్టకేలకు వాగు పై అప్రోచ్ బ్రిడ్జి నిర్మాణం జరిగింది.ఎదో ఒకటి కట్టారు అని ప్రజలు అనుకున్నారు.బ్రిడ్జి కట్టిన కొద్దీ కాలానికే కూలిపోయింది.మళ్ళీ మొదట స్థితి వచ్చింది.ఈ వాగుపై లో లెవల్ బ్రిడ్జి కట్టిన ఉండదు అని కొంతమంది చెప్పిన అధికారులు మగోడు పట్టించుకోలేదు అని మండల ప్రజలు ఆవేదన వ్యక్తి పరుస్తున్నరు. ఇదే వాగుపై రెండోవ సారి అప్రోచ్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు అదికూడా అంతంత మాత్రంగానే కట్టారు అంటున్న మండల ప్రజలు. ఇప్పుడు ఇదే వాగుపై 3వ సారి బ్రిడ్జి నిర్మాణం జరుగుతుంది. అదికూడా లో లెవల్ గా బ్రిడ్జి నిర్మిస్తున్నారు ఇదికూడా ఎంతోకాలం ఉండదు అంటున్నా మండల ప్రజలు. ఈ వాగులోకి దారపల్లి,సూది గుట్ట, బురుగువాడ ఇక పలు గ్రామలనుండి వరద నీరు అతి వేగంగా ప్రవసిస్తూ చెట్లు పెద్ద కర్రలు ఆ వరదల్లో కొట్టుకొచ్చి బ్రిడ్జి కి అడ్డుపడతాయి దీని వళ్ళ తక్కువ లెవల్ బ్రిడ్జి కడితే మళ్ళీ కూలిపోయే అవకాశం ఉంటుంది కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, మరో సారి ప్రభుత్వం ధనం వృధా కాకూడదని మండల ప్రజలు మీడియాకి తెలియపరిచారు.

## జగన్ అబద్ధాలకు అడ్డూ అదుపు లేదు

### రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చనున్న మిట్టల్ స్టీల్ ప్లాంట్
### ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ

**విజయవాడ మర్చి 26 వుదయం ప్రతినిధి:**
కూటమి ప్రభుత్వం ఏ మంచి చేసినా మాజీ ముఖ్యమంత్రి జగన్ మొదట "వేస్ట్" అంటూ దాన్ని నేనే అడ్డుకుంటా అంటాడని, కానీ అదే ప్రాజెక్టు రాష్ట్రానికి వచ్చి, ప్రజల్లో కూటమికి మంచి పేరు వస్తుందని తెలిసిన వెంటనే "ఆ ప్రాజెక్ట్ తెచ్చిందే నేనే" అంటూ ఊసరవెల్లిలా రంగు మారుస్తాడని, జగన్ అబద్దాలకు అంతే లేదని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ విమర్శించారు. అనకాపల్లి జిల్లాలో అర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన జరగడం రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని గద్దె అనురాధ నేడొక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా భారీ పెట్టుబడితో దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరగడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో గొప్ప ముందడుగని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి కుమారస్వామి పాల్గొనడం రాష్ట్రానికి ఉన్న ప్రాముఖ్యతను చాటిందన్నారు. ఇది కేవలం స్టీల్ ప్లాంట్ మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మలిచే ఉపాధి యంత్రంగా మారబోతుందని గద్దె అనురాధ స్పష్టం చేశారు.ప్రపంచం కు బేరుడైన లక్ష్మీ శ్రీనివాస్ మిట్టల్ లాంటి వారు రూ.1,35,964 కోట్ల రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెట్టారు అంటే దానికి ప్రధాన కారణం చంద్రబాబుకున్న నిబద్ధత, దార్శినికతకు నిదర్శనం అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడిదారులను ఆహ్వానించడం, ఒప్పందాలు చేసుకోవడం, దానికి కావలిసిన అన్ని అనుమతులు త్వరితగతిన తీసుకోవడం, శంకుస్థాపనలు చేయడంలో నారా లోకేష్ పట్టుదలకు నిదర్శనమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు లక్ష మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయని, ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో రాష్ట్రాన్ని పారిశ్రామికంగా బలోపేతం చేసే శక్తి ఈ ప్లాంట్‌కు ఉందన్నారు. మొత్తం 5,465 ఎకరాల్లో రెండు దశల్లో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్టు స్థానిక ఆర్థిక వ్యవస్థకు బలమైన ఊతమివ్వడంతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కొత్త అవకాశాలు తీసుకువస్తుందని చెప్పారు.జగన్ నాయకత్వంలోని గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేసిందని విమర్శించారు. "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" అనే నినాదం ప్రజల హృదయాల్లో నాటుకుపోయిందని, అటువంటి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసి నాశనం చేయబోయారన్నారు. మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకొస్తామని నారా లోకేష్ చెప్పినప్పుడు, అది అసంభవమని, ప్రజలను మోసం చేస్తున్నారని జగన్ విమర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు శంకుస్థాపన జరిగిన తర్వాత ప్రాజెక్టు తీసుకురావడంలో జగన్ తన క్రెడిట్ గా చెప్పుకోవడం వైసీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఈ ప్రాజెక్టుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం హర్షం వ్యక్తం చేయడం రాష్ట్రానికి ఉన్న ప్రాముఖ్యతను మరింతగా వెల్లడిస్తోందన్నారు. మొత్తంగా, కూటమి ప్రభుత్వం పరిశ్రమలను ఆకర్షిస్తూ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తుంటే, జగన్ బ్యాచ్ పరిశ్రమలకు భూములు ఇవ్వవద్దు అంటూ కోర్టులకు వెళ్లడం, కోర్టులలో కూడా మొట్టికాయలు తినడం అలవాటుగా మారిందన్నారు.



## శ్రీ లంకమ్మ అమ్మవారి ఉత్సవాలు విజయవంతం చెయ్యాలి

### కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి అవనిగడ్డ గ్రామ దేవత వార్షిక జాతర పోస్టర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**అవనిగడ్డ మార్చి26 (వుదయం ప్రతినిధి):**
అవనిగడ్డ గ్రామ దేవత శ్రీ లంకమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. గురువారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో అమ్మవారి ఉత్సవాల పోస్టర్లను ఆలయ ధర్మకర్తలు ఎమ్మెల్యే చేతులమీదుగా ఆవిష్కరింపచేశారు. ముందుగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ లను సత్కరించి ఆహ్వాన పత్రికలు అందించి ఉత్సవాలకు ఆహ్వానించారు. మార్చి 27 నుంచి 31వ తేదీ వరకూ అమ్మవారి గ్రామోత్సవం, ఏప్రిల్ ఒకటో తేదీ జరిగే వార్షిక ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామి, దేవాదాయ శాఖ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు సైకం శ్రీనివాసరావు,తుర్లపాటి రామ మోహనరావు (గురుస్వామి), మత్తి శివపార్వతి, మోపిదేవి శివకుమార్, పులిగడ్డ శివపార్వతి, యాసం లంకమ్మ, బట్టు మాధవి, నలుకుర్తి రాము, ఎక్స్ అఫిషియో సభ్యుడు తలగడదీవి బాలకృష్ణ, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కే.అగ్రహారంలో మెగా ఉచిత వైద్య శిబిరం

### తిరుపతి వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో రమేష్ ఐ కేర్ సంయుక్తంగా కంటి వైద్య శిబిరం
### విద్యార్థులకు గ్రామస్తులకు హోమియో మందులు పంపిణీ
### అందరికీ వినికిడి పరీక్షలు

**గూడూరు మర్చి 26 వుదయం ప్రతినిధి:**
,తిరుపతి జిల్లా రేణిగుంట మండలం వి అగ్రహారం గ్రామంలోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ ఆవరణలో గురువారం మెగా ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ ప్రారంభించారు.ముందుగా స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు శ్రీమతి ఆదిలక్ష్మి గార్ల చిత్రపటాలకు పూలమాలవేసి జ్యోతి ప్రజల చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలామోహన్ కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తమ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలు ఉండే ప్రాంతాలకు వెళ్లి కార్పొరేట్ వైద్య సేవలు వారికి అందించాలని మా ఆ క్రమంలో తిరుపతి జిల్లాలో కూడా కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు తమ ఫౌండేషన్ శ్రీకారం చుట్టిందని లీలామోహన్ కృష్ణ తెలిపారు.అనంతరం ముందుగా పాఠశాలల్లోని విద్యార్థిని విద్యార్థులకు గ్రామస్తులకు వేసవిలో సీజన్ వ్యాధులు మరియు చికెన్ ఫాక్స్ లాంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త హోమియో మందులను పంపిణీ చేశారు. అనంతరం తిరుపతి వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో కోట పట్టణంలోని రమేష్ ఐ కేర్ సంయుక్తంగా నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి అందరికీ కంప్యూటర్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్నవారిని గుర్తించి వారికి అత్యంత తక్కువగా కంటి అద్దాలను మంజూరు చేయించారు. కంటిలో శుక్రవారం ఉన్నవారికి ఉచితంగా కంటి అద్దాలు ఏర్పాటు చేస్తున్నామని, అదేవిధంగా కంటిలో పొరలు కంటిలో శుక్లాలు ఉన్నవారికి వాసన్ ఐ కేర్ నందు ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు లీలామోహన్ కృష్ణ తెలిపారు. అదేవిధంగా ప్రజలకు విద్యార్థిని విద్యార్థులకు చెవి పరీక్షలు వినికిడి యంత్రంతో పరీక్షించి వారికి చెవి సమస్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అగ్రహారం గ్రామ ప్రజలు వలసవాసులు పాల్గొని శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు, కోట పట్నం చెందిన రమేష్ ఐ కేర్ వైద్యులు వంజివాక.



## బండపై బాదుడు...

### గ్యాస్ ఏజెన్సీల అదనపు బాదుడు
### టిట్కో గృహాలో నివసిస్తున్న ప్రజలు అంటే గ్యాస్ డెలివరీ బాయ్స్ కి అంత చులకన...
### డెలివరీపై ఎక్స్ ట్రా చార్జీలంటూ దోపిడీ సిలిండర్ పై రూ.50 నుంచి రూ.70ల వసూల్ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు....

**గూడూరు మర్చి 26 వుదయం ప్రతినిధి:**
,నెల్లూరు జిల్లా గూడూరులో భారత్ గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వినియోగదారులపై భారం మోపుతున్నారు. డెలివరీ బాయ్స్ ద్వారా ఒక్కో బండపై బిల్లుకంటే రూ. 50 నుంచి రూ.70 వరకూ అదనంగా బాదేస్తున్నారు. వంటగ్యాస్ సరఫరా ఏమో కానీ దారుణమైన దోపిడీ కొనసాగుతున్నది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం తరచూ సిలిండర్ రేట్లను పెంచుతూ వాతలు పెడుతున్నది. మరోవైపు గ్యాస్ ఏజెన్సీలు సైతం వినియోగదారులను నిలువునా దోచుకుంటున్నాయి.గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు చేస్తోన్న అక్రమ దోపిడీతో వినియోగదారులపై ఏటా కోట్లాది రూపాయలు అదనపు భారం పడుతున్నది. ఎల్పీజీ సిలిండర్లను వినియోగదారులకు సరఫరా చేయడం ద్వారా సంబంధిత చమురు సంస్థల నుంచి గ్యాస్ ఏజెన్సీలకు కమీషన్ వస్తుంది. వినియోగదారుడు చెల్లించే మొత్తంలో సిలిండర్ సరఫరాకు సంబంధించిన రుసుము కూడా అంతర్లీనంగా ఉంటుంది.ఇంటికే సిలిండర్ తెచ్చి ఇవ్వాల్సిన గ్యాస్ ఏజెన్సీలు మధ్యలో డెలివరీ బాయ్స్ రూపంలో ఇష్టానుసారంగా దోపిడీ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే గాంధీ నగర్ లో ఉన్న ఏపీ టిట్కో అపార్ట్మెంట్స్ లో గ్యాస్ సిలిండర్ కి 950 రూపాయలు గాను 1010 రూపాయలు దాకా వసూలు చేస్తున్నారు. 60 రూపాయలు ఎక్స్ట్రాగా ఎందుకు కట్టాలి అని వినియోగదారుడు అడిగితే మీ అపార్ట్మెంట్స్ గూడూరు నుండి చాలా కిలోమీటర్స్ ఉన్నందువలన మేము 60 రూపాయలు ఎక్కువగా వసూలు చేస్తున్నామని నిర్లక్ష్య సమాధానం చెబుతున్నారు. 60 రూపాయలు ఎగస్ట్రాగా తీసుకున్నప్పటికీ అపార్ట్మెంట్స్ పై వరకు తీసుకురమ్మని అడిగితే దానికి ఎగస్ట్రా డబ్బులు ఇవ్వాలని లేదంటే పై వరకు తీసుకురామని కఠినంగా మాట్లాడుతున్న భారత్ గ్యాస్ డెలివరీ బాయ్. మహిళలు బతిమిలాడినా కానీ నిర్లక్ష్య సమాధానం చెబుతూ ఇష్టమైతే గ్యాస్ తీసుకోండి వద్దంటే మేమే రిటన్ తీసుకెళ్తామని హేళనగా మాట్లాడుతున్న భారత్ గ్యాస్ డెలివరీ బాయ్. ఈ విషయంపై ఫిర్యాదులు చేసినా ఎలాంటి పట్టింపు లేకుండా పోతోంది. గ్రామాల్లోనూ గ్యాస్ ఏజెన్సీలు విచ్చల విడిగా పెరిగాయి. దోపిడి విషయంలో మాత్రం అంతా సిండికేట్గా మారి డెలివరీ బాయ్స్ రూపంలో తెగబడుతున్నారు.గూడూరు మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో భారత్ గ్యాస్ వినియోగదారులు అదనపు వసూళ్లతో అల్లాడిపోతున్నారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసే క్రమంలో డెలివరీ బాయ్స్ సామాన్యుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అదనపు మొత్తాన్ని డిమాండ్ చేస్తుండటంతో వినియోగదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే పెరిగిన ధరలతో ఇబ్బంది పడుతుంటే, డెలివరీ ఛార్జీల పేరుతో చేస్తున్న ఈ అక్రమ వసూళ్లు పెను భారంగా మారాయని వినియోగదారులు వాపోతున్నారు. డబ్బులు ఇవ్వని పక్షంలో సిలిండర్లు ఇవ్వమని మొండికేస్తున్నారని, గ్రామాల్లో ఇది మరీ ఎక్కువగా ఉందని వారు పేర్కొంటున్నారు.అధికారుల పర్యవేక్షణ కరువు.గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం పర్యవేక్షణ లోపం వల్లే డెలివరీ బాయ్స్ ఈ ఆగడాలకు పాల్పడుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఇదంతా జరుగుతున్నా.. సంబంధిత శాఖ అధికారులు గానీ ఈ అక్రమ వసూళ్లపై దృష్టి సారించకపోవడం గమనార్హం.అధికారులు స్పందించాలి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వెయ్యాలని టిట్కో అపార్ట్మెంట్స్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే సిలిండర్లను సరఫరా చేసేలా చూడాలని, నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నూతన వేద రెస్టారెంట్ ప్రారంభం

### ఆత్మకూరులో మంత్రి ఆనం



**ఆత్మకూరు మార్చి 26, వుదయం ప్రతినిధి:**
దివంగత కూరగాయల శ్రీనయ్య కలలసౌధం వారి కుమారుల సారధ్యంలో ఆత్మకూరు నుండి నెల్లూరు పాలెం కు వెళ్లే రహదారిపై నేటి నుండి ప్రారంభమైన వేదఫ్యామిలీ రెస్టారెంట్. రాష్ట్ర దేవాదాయ శాఖ మాత్యులు శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి సువర్ణ హస్తాలతో ప్రారంభించబడి నది. నేటి నుండి పూర్తిస్థాయిలో కస్టమర్లకు మెచ్చే భోజనప్రియులకు నచ్చే విధంగా ప్రారంభమైన వేద రెస్టారెంట్ కు విచ్చేసి మా వ్యాపార అభివృద్ధికి సహకరించగలరని రెస్టారెంట్ నిర్వాహకులు కోరుచున్నారు.

## మత్స్యకారుల హక్కులను కాపాడుటకు వైసిపి దిద్దంగా ఉంది

### త్వరలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి జువ్వలదిన్నెకు రాక
### హెలిప్యాడ్ పరిశీలన సందర్భంగా మాట్లాడిన నాయకులు



**కావలి, మార్చి 26, వుదయం ప్రతినిధి:**
మత్స్యకారుల హక్కులను కాపాడుటకు, వారి సమస్యలపై పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని, అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి త్వరలో జువ్వలదిన్నె తీర ప్రాంతానికి రానున్నారు అని వైసిపి పెద్దలు పేర్కొన్నారు. గురువారం నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పరిసర ప్రాంతాల్లో హెలిప్యాడ్ పరిశీలన కు వైసీపీ జిల్లా కన్వీనర్ కాకాని గోవర్ధన్ రెడ్డి, కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు తలసిల రఘురామ్, పర్వాత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు విచ్చేశారు. సందర్భంగా త్వరలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తీరప్రాంత ప్రజల హక్కులను కాపాడుటకు ఈ ప్రాంతానికి రానున్న సందర్భంగా వారు హెలిపాడ్ స్థల పరిశీలన చేశారు. మత్స్యకారుల హక్కులు, వారి జీవనోపాధికి సంబంధించిన సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడానికి ఈ పర్యటన చేపట్టనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. జువ్వలదిన్నె వద్ద మత్స్యకారుల కోసం నిర్మించాల్సిన చేపల నౌకాశ్రయం కోసం ప్రభుత్వం 70 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, అందులో 29 ఎకరాలను ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించడం సరికాదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారుల కోసం కేటాయించిన భూమిలో భాగాన్ని ప్రైవేట్ సంస్థకు ఇవ్వడం ద్వారా వారి హక్కులు దెబ్బతింటాయని పేర్కొన్నారు. అలాగే సముద్ర సంపదను అక్రమంగా దోచుకుపోతున్న తమిళనాడుకు చెందిన పడవలను ఎనిమిది నెలల క్రితం నిర్బంధించినప్పటికీ, తరువాత వాటిని వదిలేయడం వెనుక ఎవరి హస్తం ఉందో ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది అన్నారు. ఈ విషయంపై మత్స్యకారులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు కనుక, జగన్ పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న హెలికాప్టర్ దిగే స్థలాన్ని కావలి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డి, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాకాని గోవర్ధన్ రెడ్డి కలిసి పరిశీలించారు.మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి

- శ్రీధర్ రెడ్డి స్పీడ్‌ను మేము అందుకోలేము
- చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామిక ప్రగతి దిశగా దూసుకుపోతుంది
- నెల్లూరు రూరల్‌లో రూ.1.51 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం లో ఎమ్మెల్యే కావ్య

**నెల్లూరు, మార్చి 26, వుదయం ప్రతినిధి**
:నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. గురువారం నెల్లూరు రూరల్ నియోజకవర్గం 24వ డివిజన్ కల్లూరుపల్లి ప్రాంతంలో రూ.1.51 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తో కలిసి ఆయన ప్రారంభించారు. కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డిని గజమాలతో సత్కరించి స్థానిక ప్రజలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శిష్యుడినేనని, ఆయన చూపుతున్న అభివృద్ధి వేగాన్ని తాము అందుకోవడం కష్టమేనని అన్నారు. రాజకీయాల్లో స్పష్టత, నిజాయితీతో ముందుకు నడిపించే నాయకత్వం ఆయనలో కనిపిస్తుందన్నారు. ఏ సమస్య వచ్చినా సలహా కోసం ఆశ్రయించేది శ్రీధర్ రెడ్డి ఒక్కరినేనని తెలిపారు. నెల్లూరు రూరల్ ప్రజలు ఒకరికి ఓటు వేస్తే ఇద్దరు నాయకులు కలిసి పనిచేస్తున్న పరిస్థితి ప్రత్యేకమని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రజల మధ్య ఉండటం నాయకుడి బాధ్యత అని అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్న నాయకత్వం లభించడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. రాజకీయాల్లో సాధారణంగా కనిపించే విభేదాలకు భిన్నంగా కోటంరెడ్డి సోదరులు చూపుతున్న సహకారభావం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఒక నాయకుడు మరొక నాయకుడిని ఆహ్వానించడం పెద్ద మనసుకు నిదర్శనమని చెప్పారు. వారి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామిక ప్రగతి దిశగా దూసుకుపోతుందని అన్నారు. పరిశ్రమలు విస్తరించడంతో యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి జెన్ని రమణయ్య, కార్పొరేటర్ ఆరవ శాంతి, టిడిపి ఎస్సి సెల్ అధ్యక్షుడు అరవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జ్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, మాతంగి కృష్ణ, కార్పొరేటర్లు భీమినేని మురహరి, బద్దెపూడి నరసింహగిరి, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, ఇతర పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు భారీగా పాల్గొన్నారు.



## మార్కాపురం బస్సు ప్రమాదం విచారకరం

### మాజీ ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి

**ఆత్మకూరుమార్చి 26, వుదయం ప్రతినిధి:**
మా 26వ తేదీ మార్కాపురం వద్ద బస్సు దగ్దమైన ఈ దుర్ఘటన హృదయ విదారకం అని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. బస్సు దగ్ధమై అమాయక ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం మనసును కలచివేస్తోంది అని. బాధిత కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలి. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కల్పించాలి. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి అని. ప్రమాదానికి గల అసలు కారణాలను వెలికితీసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి అని. రోడ్డు భద్రతపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది అని.ప్రజల ప్రాణాలు ఎంతో విలువైనవి.వాటి రక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించరాదు అని. ఈ ఘటనకు బాధ్యతలు అయిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

## బీసీ నాయకుడు కొమారి శ్రీనివాసులుకు నివాళులర్పించిన నాయకులు



**కావలి, మార్చి 26, వుదయం ప్రతినిధి:**
కావలి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా కొమారి శ్రీనివాసులు అనేక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని బీసీల ఉనికిని చాటడంలో కీలకపాత్ర పోషించారు. ఇటీవల ఆయన మృతి చెందగా గురువారం ఆయన ఉత్తరక్రియల సందర్భంగా చిత్రపతానికి బీసీ సంఘం నాయకులు నివాళులు అర్పించారు. కావలి పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం మొట్టమొదట స్థాపించి దానిలో చురుకుగా పాల్గొన్న బీసీ సీనియర్ మత్స్యకార నాయకులు కొమారి శ్రీనివాసులు ఉత్తర క్రియలు కావలి మండలంలోని తుమ్మలపెంట గ్రామంలో వారి నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా బిసి ఐక్యత భవన్ నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షులు అద్దంకి ప్రభాకర్ రావు, బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఉరిటి గోవిందు, ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాద రావు, బీసీ ఐక్యత భవన్ సీనియర్ అడ్వకేట్ సాయి ప్రసాద్, కుమ్మర సంఘం కావలి ఇన్చార్జ్ బెజవాడ అభిసాగర్, ప్రజాపతి మాట్లాడుతూ కావలి పట్టణంలో రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా బీసీలు ఎదగాలనే ఉద్దేశంతో బీసీ సంక్షేమ సంఘంను ఏర్పాటు చేసి బీసీల ఉనికి చాటేందుకు ఆయన చేసిన కృషి ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపెంట సీనియర్ నాయకులు కొమారి రాజు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు లో గొడవలకు కారణమవుతున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం

**ఆత్మకూరు మార్చి 26, వుదయం ప్రతినిధి**
ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ వద్ద ఎన్నో ఏళ్లుగా ముఖ్య కేంద్రంగా పిలవబడే అంబేద్కర్ సెంటర్ ఇప్పుడు వివాదాలకు నిలయంగా మారింది.. అంబేద్కర్ విగ్రహం గతంలో ఎంతో ప్రశాంత వాతావరణంలో అంబేద్కర్ విగ్రహం కనిపిస్తూ మహానుభావుని కీర్తిని తెలుసుకునేలా ఉండేది.. పట్టణంలో ఎటువంటి నిరసన, ధర్నా, సంతాపం కార్యక్రమాలు, ఉద్యమ వేదికలు, నినాదాలు ఏవైనా నిర్వహించిన ఈ అంబేద్కర్ విగ్రహం ఎదుటే తమ భావాన్ని తెలిపేవారు.. ప్రస్తుతం విగ్రహం ఎదుట గొడవలకు తావిస్తూ స్థల వివాదాలతో కొట్లాటకు కూడా దిగే పరిస్థితి నెలకొంది.. విగ్రహం చుట్టూ తోపుడుబండ్లు ఏజెన్సీల ప్రమోషన్లు, సిమ్ కార్డుల అమ్మకాలు, షామియానాలు వేసీ మరి ఉదయం నుండి సాయంత్రం వరకు తమ వ్యాపార కార్యక్రమాలు నిర్వహించుకుంటూ ఇక్కడ అంబేద్కర్ విగ్రహం ఉంది అనే భావన కూడా లేకుండా చేసేస్తున్నారు. ఇక్కడ బండ్లు పెట్టుకుంటున్న వారు ఇటీవల గొడవలకు దిగుతూ రాత్రి ఏకంగా కొట్లాటకు దిగే పరిస్థితి ఏర్పడింది. గతంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట అనే ఓ పదం ఉండేది. ఇప్పుడు తోపుడుబండ్ల ముందు అనే పదం వచ్చేసింది. బాబా సాహెబ్ అంబేద్కర్ మా జాతికి నేత బదుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అని చెప్పుకునే వారు ఎటుపోయారు.అంబేద్కర్ వారసులం వారి నినాదం మా గుండెకాయ అంటూ చొక్కాలు చింపుకొని అంబేద్కర్ అభిమానులు ఎటుపోయారో. భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించిన ఓ మహానుభావుడు అణగారిన వర్గాలకు అట్టడుగు నుండి అందలం ఎక్కించిన ఓ మహా నేత విగ్రహం కనిపించకుండా చుట్టూ పొరలు కమ్ముకుంటున్న వీరికి కనిపించకపోవడం శోచనీయం సిగ్గుచేటు..ఇప్పుడైనా కళ్ళు తెరవండి మేలుకొండి అంబేద్కర్ విగ్రహం ఒకటి ఉంది అని చెప్పుకోవడం కోసం తప్ప రాబోవు తరాలకు దాన్ని రూపులు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడుతుంది..నేటి తరానికి ఆ మహనేత రూపును కనిపించేలా మన బాధ్యత. ఆత్మకూరు మున్సిపాలిటీ కమిషనర్ అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న తోపుడు బండ్లు వెంటనే క్లీన్ చేసి అక్కడ ప్రశాంతమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయించడం ఆత్మకూరు మున్సిపాలిటీ కమిషనర్ బాధ్యతని అంబేద్కర్ వాదులు తెలియజేస్తున్నారు.

### అబ్దుల్ అజీజ్ ని పరామర్శించిన కావలి ఎమ్మెల్యే



**కావలి, మార్చి 26, వుదయం ప్రతినిధి:**
ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఇటీవల మాతృవియోగం చెందారు. కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి గురువారం నెల్లూరులోని అజీజ్ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గ ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ అల్ హర్, టీడీపీ నాయకులు రేబాల శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం-అంతర్జాతీయం



## దేశంలో ఎల్పీజీ, ఇంధన కొరతలేదు

### ఉద్దేశ్యపూర్వకంగానే భయాందోళనలు సృష్టిస్తున్నారు : పెట్రోలియం మంత్రిత్వ శాఖ

**న్యూఢిల్లీ, మార్చి 26 (వుదయం) :** భారతదేశ ఇంధన, ఎల్పిజి సరఫరాలు పూర్తిగా సురక్షితంగా ఉన్నాయని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ గురువారం ధృవీకరించింది. అన్నిరిటైల్ అవుట్‌లెట్లలో తగినంత నిల్వలు ఉన్నాయి. సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచారం వ్యాప్తి చెంది భయాందోళనలతో కొనుగోళ్లకు పాల్పడుతున్నప్పటికీ, దేశీయ ఉత్పత్తి, దిగుమతులు ఇంధన సరఫరాకు పూర్తి భద్రతను కల్పిస్తున్నాయని, అనవసరమైన భయాందోళనలను వ్యాపింపజేస్తున్న తప్పుడు సమాచారంతో తప్పుదోవ పట్టవద్దని మంత్రిత్వ శాఖ పౌరులకు సూచించింది. భారతదేశం ప్రపంచంలో పెట్రోలియం ఉత్పత్తులను శుద్ధి చేసే దేశాలలో నాలుగవ స్థానంలో, ఎగుమతి చేసే దేశాలలో ఐదవ స్థానంలో ఉంది. ఇది 150కి పైగా దేశాలకు ఇంధనాన్ని సరఫరా చేస్తోంది. దేశీయంగా పెట్రోల్, డీజిల్ లభ్యతకు పూర్తి హామీ ఇచ్చింది. లక్షకు పైగా ఉన్న అన్ని ఇంధన కేంద్రాలు రేషనింగ్ లేకుండా తెరిచే ఉన్నాయి. చెదురుమదురుగా జరిగిన భయాందోళన కొనుగోళ్లు



కూడా సోషల్ మీడియాలో తప్పుదోవ పట్టించే సమాచారం కారణంగానే జరిగాయి. చమురు కంపెనీల డిపోలు రాత్రంతా పనిచేస్తూనే ఉన్నాయి, నిరంతరాయ సరఫరాను నిర్ధారించడానికి పంపులకు రుణ సదుపాయం కల్పించినట్టు మంత్రిత్వ శాఖ వివరించింది.

**ముడి చమురు సరఫరా బలంగా కొనసాగుతోంది**

హొర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, భారతదేశం గతంలో కంటే 41కి పైగా సరఫరాదారుల నుంచి ఎక్కువ ముడి చమురును పొందుతోంది. ప్రతి రిఫైనరీ 100% కంటే ఎక్కువ సామర్థ్యంతో పనిచేస్తోంది. రానున్న 60 రోజులకు సరిపడా సరఫరా ఇప్పటికే సమకూరిందని, లభ్యతలో ఎలాంటి అంతరాయం లేదని మంత్రిత్వ శాఖ తెలిపింది.

**తగినన్ని వ్యూహాత్మక నిల్వలు**

కేవలం ఆరు రోజుల నిల్వ మాత్రమే ఉందని చెబుతున్న నివేదికలు అవాస్తవమని మంత్రిత్వ శాఖ తెలిపింది. ముడి చమురు, ఉత్పత్తులు, వ్యూహాత్మక నిల్వలతో కలిపి భారతదేశానికి 74 రోజుల మొత్తం నిల్వ సామర్థ్యం, సుమారు 60 రోజుల వాస్తవ నిల్వ ఉంది. అదనపు ముడి చమురు సేకరణ కొనసాగుతుండటంతో, దాదాపు రెండు నెలల సరఫరాకు భరోసా ఉంది.

**ఎల్పీజీ ఉత్పత్తి పెరిగింది, దిగుమతులు సురక్షితం**

దేశీయ ఎల్పీజీ ఉత్పత్తి 40% పెరిగి, ఇప్పుడు రోజువారీ అవసరాలలో 60% పైగా తీరుస్తోంది. అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా సహా ఇతర దేశాల నుండి 800 టీఎంటీల దిగుమతులు సురక్షితం చేశామని మంత్రిత్వ శాఖ పేర్కొంది. నిల్వలను నివారించడానికి వాణిజ్య కేటాయింపులను పెంచడంతో, చమురు కంపెనీలు ప్రతిరోజూ 50 లక్షలకు పైగా సిలిండర్లను సరఫరా చేస్తున్నాయి.

**పీఎన్‌జీ ప్రోత్సాహానికి ఎల్పీజీ కొరతకు సంబంధం లేదు**

పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) పరిశుభ్రమైనది, సురక్షితమైనది, మరింత సరసమైనది కనుక దానిని ప్రోత్సహిస్తున్నామని పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. భారతదేశం రోజుకు 92 ఎంఎంఎస్‌సీఎండీ సహజ వాయువును ఉత్పత్తి చేస్తూ, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తోంది. నగర గ్యాస్ పంపిణీ ప్రాంతాలు 2014లో 57 నుండి 300కు పైగా పెరిగాయి, గృహ కనెక్షన్లు 25 లక్షల నుండి 1.5 కోట్లకు పైగా పెరిగాయి. ఎల్పీజీ సరఫరా సురక్షితంగా ఉంది.

## నీరవ్ మోడీ భారత్‌కు రావలసిందే

### లండన్‌లో ఆయన పిటిషన్‌ను తిరస్కరించిన కోర్టు



**వుదయం డెస్క్, మార్చి 26 :** పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను (పిఎన్‌బి) వేల కోట్లకు ముంచి, పరారైన ఆర్థిక నేరగాడు, వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ భారత్‌కు తిరిగి రావడం తప్పేట్టు లేదు. అతడిని భారత్‌కు అప్పగించాలన్న కోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ ఆయన తరపు లాయర్లు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ఆఫ్ జస్టిస్ కింగ్స్ బెంచి డివిజన్ తిరస్కరించింది. భారత్‌కు రాకుండా ఉండేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలకు కోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది.

పిఎన్‌బిని మోసగించిన కేసులో నిందితుడైన నీరవ్ మోడీ ప్రస్తుతం బ్రిటన్‌లో ఉన్నారు. ఆయనను స్వదేశానికి పంపించాలని భారత్ కోరినప్పుడు అక్కడి కోర్టు అంగీకరించింది. కాగా, దీన్ని సవాలు చేస్తూ నీరవ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భారత్ జైళ్లల్లో పరిస్థితులు, భద్రతపై భారత అధికారులు ఇచ్చిన హామీలు సందేహాస్పదమని ఆయన వాదించారు. ఈ విషయంపై మరోసారి దృష్టిసారించాలని అన్నారు. కానీ కోర్టు నీరవ్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. గత ఆదేశాలను మళ్లీ సమీక్షించేందుకు కారణాలు ఏవీ లేవని పేర్కొంది.

నీరవ్ మోడీ కేసులో సీబీఐ దర్యాప్తు చేపడుతోంది. ఆయనను భారత్‌కు రప్పించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తోంది. ఆయనపై పలు కేసులు ఉండటంతో ఈడీ కూడా దర్యాప్తు జరుపుతోంది. పీఎన్‌బీ బ్యాంకుకు చెందిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్‌తో నీరవ్, ఆయన బంధువు మేహుల్ చోస్కీ భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడిన విషయం తెలిసిందే.

## హొర్ముజ్ ద్వారా సురక్షిత యానానికి భారత్ నౌకలకు అనుమతి

### పశ్చిమ ఆసియా సంఘర్షణలో ఇరాన్ అనుమతించిన ఐదు దేశాలలో భారత్ ఒకటి

**వుదయండెస్క్, మార్చి 26 :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ నడుమ, భారత్ సహా ఎంపిక చేసిన మిత్రదేశాలకు చెందిన నౌకలను వ్యూహాత్మకమైన కీలక హొర్ముజ్ జలసంధి గుండా సురక్షితంగా వెళ్లేందుకు అనుమతించాలని ఇరాన్ నిర్ణయించినట్టు తెలుస్తోంది. కాగా, మిగిలిన వాళ్లకు ఆంక్షలు ఉంటాయని పేర్కొంది. సంఘర్షణ ప్రభావిత ప్రాంతంలో ఇరాన్ పాక్షిక దిగ్బంధనాన్ని అమలు చేస్తూ, అదే సమయంలో తనకు సన్నిహిత సంబంధాలున్న దేశాలకు ప్రవేశాన్ని కల్పిస్తున్న తరుణంలో ఈ చర్య తీసుకుంది. భారతదేశంతో పాటు, రష్యా, చైనా, పాకిస్తాన్, ఇరాక్‌లకు చెందిన నౌకలకు కూడా ఈ కీలకమైన సముద్ర మార్గం గుండా సురక్షిత ప్రయాణానికి అనుమతి లభించింది.




ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి మాట్లాడుతూ, ఆ జలమార్గం పూర్తిగా మూసివేయలేదని, ఈ ఏర్పాటు వల్ల భారతీయ నౌకలు ఇప్పటికే ప్రయోజనం పొందాయని ధృవీకరించారు.

చాలా మంది నౌకా యజమానులు, లేదా ఈ నౌకలను కలిగి ఉన్న దేశాలు, మమ్మల్ని సంప్రదించి, జలసంధి గుండా తమ సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించాలని అభ్యర్థించారు. మేము మిత్రదేశాలుగా భావించే కొన్ని దేశాలకు, లేదా ఇతర కారణాల వల్ల మేము అలా చేయాలని నిర్ణయించుకున్న సందర్భాలలో, మా సాయుధ దళాలు సురక్షిత ప్రయాణాన్ని కల్పించాయి, అని ప్రభుత్వ టీవీకి చెప్పిన విషయాన్ని ఉటంకిస్తూ రాయిటర్స్ నివేదిక పేర్కొంది.

మీరు వార్తలలో చూసినట్లుగా, చైనా, రష్యా, పాకిస్తాన్, ఇరాక్, భారతదేశం ఇందులో ఉన్నాయి. కొన్ని రాత్రుల క్రితం భారతదేశానికి చెందిన రెండు నౌకలు, మరికొన్ని దేశాలు, బంగ్లాదేశ్ కు చెందినవి కూడా ప్రయాణించాయని తాను నమ్ముతున్నానని, ఇవి తమతో మాట్లాడి, సమన్వయం చేసుకున్న దేశాలంటూ, యుద్ధం తర్వాత కూడా భవిష్యత్తులో ఇది కొనసాగుతుందని తెలిపారు.

అయితే, తాము శత్రు దేశాలుగా అభివర్ణించిన దేశాలకు, వాటి మిత్రదేశాలకు జలసంధిలోకి ప్రవేశం పరిమితంగానే ఉంటుందని ఇరాన్ స్పష్టం చేసింది. కొనసాగుతున్న సంఘర్షణలో పాల్గొంటున్న యునైటెడ్ స్టేట్స్, ఇజ్రాయెల్, కొన్ని గల్ఫ్ దేశాలకు చెందిన నౌకలను ప్రయాణించడానికి అనుమతించరు.

తాము యుద్ధ స్థితిలో ఉన్నామని, ఈ ప్రాంతం ఒక యుద్ధ క్షేత్రం; కనుక, మా శత్రువుల, వారి మిత్రదేశాల నౌకలను జలసంధి గుండా వెళ్లడానికి అనుమతించాల్సిన అవసరం ఏమాత్రం లేదు. అయితే, ఇతర దేశాలకు మాత్రం ఈ మార్గం అందుబాటులోనే ఉంటుంది, అని అరఘ్చి పేర్కొన్నారు.

ఈ జలమార్గంపై ఇరాన్‌కు ఉన్న ఆధిపత్యాన్ని అరఘ్చి నొక్కిచెప్పారు. ఈ పాక్షిక దిగ్బంధంపై తొలుత ప్రపంచవ్యాప్తంగా సందేహాలు వ్యక్తమైనప్పటికీ, ఇది ఆ దేశపు వ్యూహాత్మక సామర్థ్యాన్ని స్పష్టంగా చాటిచెప్పిందని ఆయన తెలిపారు. ఇలాంటి పని చేసే ధైర్యం ఇరాన్‌కు లేదని వారు భావించారు. కానీ మేము దానిని ఎంతో బలంగా చేసి చూపించాం. దీనిని అడ్డుకోవడానికి వారు తమ సర్వశక్తులను ఒడ్డారు, కానీ విఫలమయ్యారు. వారు ఇతర దేశాలను కూడా ఆశ్రయించారు. ఈ జలమార్గాన్ని తిరిగి తెరిచేందుకు వచ్చి సహాయపడమని, తాము స్వయంగా శత్రువులుగా భావించే వారిని కూడా వారు వేడుకున్నారు. కానీ ఎవరూ స్పందించలేదు; ఎందుకంటే, ఆ పని ఆచరణసాధ్యం కాదు, అని అరఘ్చి పేర్కొన్నారు. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హొర్ముజ్ జలసంధి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకు కేంద్రంగా కొనసాగుతోంది. ఇరాన్ అనుసరిస్తున్న ఎంపిక చేసిన ప్రవేశ విధానం ప్రస్తుతం ఈ ప్రాంతంలో సముద్రయాన కదలికలను ప్రభావితం చేస్తోంది.

ఇతర దేశాలకు చెందిన లేదా వాటితో సంబంధం ఉన్న నౌకలతో సహా, శత్రుత్వం వహించని నౌకలు అవి ఇరాన్‌పై దురాక్రమణ చర్యలలో పాల్గొనకుండా లేదా వాటికి మద్దతు ఇవ్వకుండా, ప్రకటించిన భద్రతా నిబంధనలను పూర్తిగా పాటించిన పక్షంలో సమర్థవంతమైన ఇరాన్ అధికారుల సమన్వయంతో హొర్ముజ్ జలసంధి గుండా సురక్షిత ప్రయాణ సౌకర్యాన్ని పొందవచ్చు అని న్యూయార్క్‌లోని ఇరాన్ మిషన్ ఎక్స్‌పై పోస్టు చేసింది.

## యుఎఇలో క్షిపణి శకలాలు పడి 2 మృతి

**వుదయం డెస్క్, మార్చి 26 :** అబుదాబిలోని ఒక వీధిపై, వాయు రక్షణ వ్యవస్థ అడ్డుకున్న క్షిపణుల శకలాలు పడటంతో కనీసం ఇద్దరు మరణించగా, ముగ్గురు గాయపడ్డారని స్థానిక మీడియా తెలిపింది.

ఇరాన్ నుండి వస్తున్న క్షిపణి, డ్రోన్ ముప్పులకు యుఎఇ వాయు రక్షణ వ్యవస్థలు ఎప్పటికప్పుడు ప్రతిస్పందిస్తున్నాయని, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రక్షణ మంత్రిత్వ శాఖ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన హెచ్చరికలు వెల్లడిస్తున్నాయి. వాయు రక్షణ వ్యవస్థల ద్వారా ఒక బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా అడ్డుకున్న అనంతరం, స్వీహాన్ వీధిలో శకలాలు పడిన ఘటనపై అబుదాబి అధికారులు స్పందించారు, అని అబుదాబి మీడియా కార్యాలయం పేర్కొంది.

ఈ ఘటనలో ఇద్దరు గుర్తుతెలియని



వ్యక్తులు మరణించగా, ముగ్గురు గాయపడ్డారు, పలు కార్లు దెబ్బతిన్నాయి. తదుపరి వివరాలు తగిన సమయంలో తెలియచేస్తామని ఆ సంస్థ పేర్కొంది.

అబుదాబిలో జరిగిన తాజా ఘటనతో మొత్తం మరణాల సంఖ్య 11కి చేరిందని గల్ఫ్ న్యూస్ నివేదించింది.

గతంలో మరణించిన తొమ్మిది మందిలో సాయుధ దళాలకు చెందిన ముగ్గురు సభ్యులు ఉన్నారు.

పాకిస్తానీ, నేపాలీ, బంగ్లాదేశీ, పాలస్తీనియన్ జాతీయతలకు చెందిన ఆరుగురు వ్యక్తులు కూడా ఇప్పటివరకు మరణించారని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఇరాన్ దారుణమైన దురాక్రమణ ప్రారంభమైనప్పటి నుండి, యుఎఇ వాయు రక్షణ వ్యవస్థలు 357 బాలిస్టిక్ క్షిపణులు, 15 క్రూయిజ్ క్షిపణులు, 1,815 యుఎవిలను ఎదుర్కొన్నాయి అని బుధవారం మంత్రిత్వ శాఖ పేర్కొంది. బుధవారం నాటికి మొత్తం 166 మంది గాయపడ్డారు; వీరి గాయాలు స్వల్పం నుండి మధ్యస్థ, తీవ్ర స్థాయిల వరకు ఉన్నాయి. గాయపడిన వారిలో యుఎఇ, ఈజిప్ట్, సూడాన్, ఇథియోపియా, ఫిలిప్పీన్స్, పాకిస్తాన్, ఇరాన్, ఇండియా, బంగ్లాదేశ్, శ్రీలంక, అజర్‌బైజాన్, యెమెన్, ఉగాండా, ఎరిట్రియా, లెబనాన్, ఆఫ్ఘనిస్తాన్, బహ్రెయిన్, కొమొరోస్, టర్కీ, ఇరాక్, నేపాల్, నైజీరియా, ఒమన్, జోర్డాన్, పాలస్తీనా, ఘానా, ఇండోనేషియా, స్వీడన్, టునీషియా దేశాలకు చెందిన పౌరులు ఉన్నారని అది తెలిపింది.

ఎటువంటి ముప్పులనైనా ఎదుర్కోవడానికి తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని, దేశ సార్వభౌమత్వం, భద్రత, స్థిరత్వానికి రక్షణ కల్పిస్తూ, జాతీయ ప్రయోజనాలు, సామర్థ్యాలను పరిరక్షించే రీతిలో దేశ భద్రతను దెబ్బతీసే ఏ ప్రయత్నాలనైనా దృఢంగా ఎదుర్కొంటామని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## మీడియా మాపై తప్పుడు ప్రచారాలు చేస్తోంది

### ఇరాన్‌కు మద్దతుపై క్రెమ్లిన్ స్పష్టీకరణ

**వుదయం డెస్క్, మార్చి 26 :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణలో తెహ్రాన్‌కు మాస్కో మద్దతునిస్తూ, డ్రోన్లను పంపడానికి రష్యా సిద్ధంగా ఉందంటూ వచ్చిన వార్తలను క్రెమ్లిన్ ఖండించింది. తమ గురించి అనేక అబద్ధాలు మీడియా ప్రచారం చేస్తోందని, వాటిని నమ్మవద్దని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ విజ్ఞప్తి చేశాయి.

అంతకు ముందు మీడియాలో, అమెరికాఇజ్రాయెల్‌తో యుద్ధం చేస్తోన్న ఇరాన్‌కు రష్యా నుంచి సహాయం అందుతున్నట్లు తెలుస్తోందని పేర్కొంది. ఆ దేశానికి పుతిన్ ప్రభుత్వం దశలవారీగా డ్రోన్లను బట్వాడా చేస్తోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నెలాఖరుకు ఆ రవాణా పూర్తికానుందని వెల్లడించాయి. డ్రోన్లతో పాటు ఆహారం, ఔషధాలను కూడా పంపిస్తోందంటూ వివరించాయి. ఇరాన్ అభివృద్ధి చేసిన డ్రోన్లను రష్యా తయారు



చేస్తోంది. వాటిని ఉక్రెయిన్ యుద్ధంలో ఉపయోగిస్తోంది. ఇరాన్ సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ షిప్‌మెంట్లు చేస్తోంది అని పశ్చిమదేశాల నిఘా సమాచారాన్ని మీడియా సంస్థలు ఉటంకించాయి.

అమెరికా యుద్ధవిమానాలు, యుద్ధనౌకలు, సైనిక స్థావరాల గురించి ఇరాన్‌కు రష్యా 'వాస్తవ సమయ నిఘా' సహకారం అందిస్తోందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఆ సమాచారాన్ని ఇరాన్‌కు రష్యా చేరవేస్తోందని వాటి సారాంశం. ఇక తాజా కథనాలపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి స్పందించారు. 'ప్రస్తుతం చాలా నకిలీ వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఇక్కడ ఒకటి మాత్రం వాస్తవం. ఇరాన్ నాయకత్వంతో మా సంప్రదింపులు కొనసాగిస్తున్నాం అని స్పష్టం చేశారు.

ఇరాన్‌లోని బుషెహర్ అణు కేంద్రం నుంచి తన ఉద్యోగులను రష్యా వెనక్కి పిలిపించింది. మంగళవారం ఈ కేంద్రంపై క్షిపణి పడిన నేపథ్యంలో 163 మంది సిబ్బందిని అక్కడినుంచి తరలించింది. ఈ కేంద్రాన్ని నిర్మించింది రష్యానే. మిగతా యూనిట్ల నిర్మాణం కోసం అక్కడ కొందరు సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి అక్కడ కార్యకలాపాలను నిలిపివేసింది.

## బుర్జ్ ఖలీఫా చేరిన మహదేవ్ బెట్టింగ్ యాప్ దర్యాప్తు



**వుదయం డెస్క్, మార్చి 26:** వందలకోట్ల రూపాయల విలువైన మహదేవ్ యాప్ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇడి) చేపట్టిన దర్యాప్తు ఇప్పుడు బుర్జ్ ఖలీఫా వరకు విస్తరించింది. దుబాయ్ హిల్స్ ఎస్టేట్ లోని అపార్ట్‌మెంట్లు, బిజినెస్ బే, ఎస్ ఎల్ ఎస్ హోటల్ అండ్ రెసిడెన్సెస్‌లోని విలాసవంతమైన నివాసాలు, అలాగే బుర్జ్ ఖలీఫాలోని ఒక ఫ్లాట్‌తో సహా మొత్తం రూ. 1,700 కోట్ల విలువైన ఆస్తులను ఇడి జప్తు చేసినట్లు ఒక అధికారిని ఉటంకిస్తూ ది ప్రింట్ పత్రిక నివేదించింది.

ఎస్ ఐఎతో పాటు, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ ఐఎ), ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వంటి పలు జాతీయ సంస్థల నిశిత పరిశీలన పరిధిలోకి ఈ దర్యాప్తు ఇప్పుడు చేరింది.

ఈ ఆస్తులు మహాదేవ్ ఆన్‌లైన్ బుక్ బెట్టింగ్ వేదిక ప్రధాన నిర్వాహకులలో ఒకరైన సౌరభ్ చంద్రకర్‌కు చెందినవని అధికారులు తెలిపారు. చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలకు సంబంధించిన నేరాలకు పాల్పడటం ద్వారా సమకూరిన నేర ఆదాయంతో ఈ ఆస్తులను సముపార్జించారు, అని ఆ అధికారి తెలిపారు. వికాస్ ఛపారియా, రోహిత్ గులాటి, అతుల్ అరోరా, నితిన్ తిబ్రెవాల్, సురేంద్ర బగ్రీలతో సహా, అతడు, అతని అనుచరుల నియంత్రణలో ఉన్న సంస్థల ద్వారా ఈ ఆస్తులను కలిగి ఉన్నారు.

**మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసు ఏమిటి?**

నకిలీ గుర్తింపులతో తెరిచిన బ్యాంకు ఖాతాల ద్వారా వేల కోట్ల రూపాయలు మళ్లించినట్టుగా ఆరోపణలు ఎదుర్కొన్న చట్ట విరుద్ధ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌కు సంబంధించినది. ఇందులో షెల్ కంపెనీలు, విదేశీ కాల్ సెంటర్లు, హవాలా నెట్‌వర్క్‌తో కూడిన ఒక సంక్లిష్టమైన వలయం కూడా ఉంది.

మహాదేవ్ ఆన్‌లైన్ బుక్ యాప్, పోకర్, కార్డ్ గేమ్స్, అవకాశంపై ఆధారపడిన గేమ్స్ వంటి లైవ్ గేమ్స్ తో పాటు, క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్, ఫుట్‌బాల్ వంటి వర్చువల్ క్రీడలపై కూడా బెట్టింగ్‌కు వీలు కల్పించిందని ఆరోపణలు ఉన్నాయి. వినియోగదారులు టీన్ పట్టి, పోకర్, డ్రాగన్ టైగర్ ఆడటంతో పాటు, భారతదేశంలోని ఎన్నికలపై కూడా పందాలు వేయగలిగారు. వాస్తవానికి భిలాయ్‌కు చెందిన చంద్రకర్, అతని సహచరులు, భారీ సంఖ్యలో వినియోగదారులను సంపాదించి, చట్టవిరుద్ధంగా రూ. 5,000 కోట్లకు పైగా సంపాదించారని, ఆ సొమ్మును హవాలా మార్గాల ద్వారా విదేశాలకు పంపి, లంచాలు చెల్లించడానికి ఉపయోగించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

## రష్యా ముడిచమురు రవాణా నౌకపై దాడి

**వుదయం డెస్క్, మార్చి 26:** విదేశీ జెండాతో తుర్కియే నిర్వహణలో గల ముడిచమురు టాంకర్‌పై నల్లసముద్రంలో దాడి జరిగింది. రష్యా చమురు రవాణా చేస్తున్న నౌకపై దాడి జరిగింది. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగిందని తుర్కియే రవాణా శాఖ మంత్రి అబ్దుల్‌ఖాదిర్ వెల్లడించారు. తుర్కియే కంపెనీ ఆధ్వర్యంలో విదేశీ జెండాతో వెళ్తున్న నౌక అది. అది రష్యా నుంచి ముడి చమురు తీసుకొస్తోంది. దాని ఇంజిన్ రూమ్‌లో పేలుడు సంభవించినట్లు తమ ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌కు సమాచారం వచ్చిందని తెలిపారు. ఇంజిన్



రూమ్ లక్ష్యంగా ఆ దాడి జరిగిందని, అది డ్రోన్ కాకపోవచ్చని పేర్కొన్నారు. అన్‌మ్యాన్డ్ సర్ఫేస్ వెహికిల్ దాడి కావొచ్చు అని మంత్రి వెల్లడించారు. బాస్ఫరస్ జలసంధికి 30 కి.మీ.దూరంలో ఈ దాడి జరిగింది. ఆ నౌకపై ఉన్న జెండా సియెర్రా లియోన్ దేశానిదని తెలుస్తోంది. నౌకలో దాదాపు ఒక మిలియన్ డాలర్ల రష్యా ముడి చమురు ఉందని తెలుస్తోంది. ఈ నౌక నొవొరొసిస్క్ నుంచి బయలుదేరినట్టు డేటా వెల్లడిస్తోంది.

## విభేధాలను తగ్గించుకునేందుకు జి7 సమావేశం

**వుదయం డెస్క్, మార్చి 26 :** మధ్యప్రాచ్య యుద్ధంపై అమెరికాతో ఉన్న విభేదాలను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తూనే, ఉక్రెయిన్, గాజా వంటి ఇతర సంక్షోభాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్న జి7 యూరోపియన్ దేశాలు, మిత్రదేశాల విదేశాంగ మంత్రులు గురువారం నుంచి పారిస్ వెలుపల సమావేశమవుతున్నారు.

పారిస్ వెలుపల గ్రామీణ ప్రాంతంలోని వాక్స్ డి సెర్నే అబ్బేలో ఏడు ప్రముఖ పారిశ్రామిక ప్రజాస్వామ్య దేశాల రెండు రోజుల సమావేశం జరుగుతున్న తరుణంలో, ట్రంప్ ప్రకటన చేశారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌పై అమెరికాఇజ్రాయెల్ యుద్ధాన్ని ముగించే ఒప్పందాన్ని ఇరాన్ అంగీకరించకపోతే, తీవ్ర చర్యలు తీసుకోవడానికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధంగా ఉన్నారని వైట్ హౌస్ పేర్కొంది.

యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి తన తొలి విదేశీ పర్యటనలో భాగంగా, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో కెనడా, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, జపాన్, యూకే దేశాల అగ్రశ్రేణి దౌత్యవేత్తలతో కలిసి రెండవ రోజు మాత్రమే పాల్గొంటారు.

వంతులవారీగా జి7 అధ్యక్ష పదవిని నిర్వహిస్తున్న క్రమంలో ఈ ఏడాది ఆ స్థానంలో ఉన్న ఫ్రాన్స్ లక్ష్యాలలో ఒకటి, ప్రధాన ప్రపంచ అసమతుల్యతలను పరిష్కరించే మార్గాలను కొనుగొనడమని పేర్కొంది. మన తోటి పౌరులపై దుష్పరిణామాలను కలిగిస్తున్న అనేక స్థాయిల్లోని ఉద్రిక్తత, శత్రుత్వానికి ఈ అసమతుల్యతే కారణమని, ఫ్రెంచి విదేశాంగ మంత్రి జీన్ నోయెల్ బారట్ పేర్కొన్నారు.

ఇరాన్ మద్దతుగల షియా మిలిటెంట్ గ్రూప్ హిజ్బుల్లా ఇజ్రాయెల్‌పైకి రాకెట్లను ప్రయోగించడంతో లెబనాన్ ను కూడా యుద్ధంలోకి లాగిన నేపథ్యంలో, దక్షిణ లెబనాన్‌లోని ఒక



ప్రాంతాన్ని నియంత్రణలోకి తీసుకోవడానికి బలగాలను పంపవద్దని బారట్ ఇజ్రాయెల్‌ను కోరారు.

1975లో సమీపంలోని చాటో డి రాంబొయిలెట్‌లో జరిగిన మొదటి జి6 శిఖరాగ్ర సమావేశంతో ప్రారంభమైన ప్రతిష్టాత్మక జి7 కూటమి పరిధిని విస్తరించే ప్రయత్నంలో, ఫ్రాన్స్ కీలక వర్ధమాన మార్కెట్లైన బ్రెజిల్, భారతదేశంతో పాటు ఉక్రెయిన్, సౌదీ అరేబియా, దక్షిణ కొరియాల విదేశాంగ మంత్రులను కూడా ఆహ్వానించింది.

సోమవారం నాడు, ఆర్థిక మంత్రులు, ఇంధన మంత్రులు, కేంద్ర బ్యాంకు గవర్నర్లను ఒకచోట చేర్చే ప్రత్యేక జి7 సమావేశానికి కూడా ఫ్రాన్స్ ఆతిథ్యం ఇవ్వనుందని ఆర్థిక మంత్రి రోలాండ్ లెస్కూర్ గురువారం ఆర్‌టిఎల్ రేడియోతో తెలిపారు.

వీడియో కాల్ ద్వారా జరగనున్న ఈ సమావేశం, లెస్కూర్ అభివర్ణించినట్లుగా ఇంధన సమస్యలు, ఆర్థిక సమస్యలు, ద్రవ్యోల్బణ సమస్యల సమ్మేళనం వంటి అంశాలను చర్చించనుంది.

**తప్పుడు విధానాలు**

జి7 దేశాలన్నీ అమెరికాకు సన్నిహిత మిత్రదేశాలే అయినప్పటికీ, ఇరాన్‌పై దాడికి ఏ దేశమూ స్పష్టంగా మద్దతు ప్రకటించకపోవడం ట్రంప్‌కు ఆగ్రహం తెప్పించింది.

జర్మనీ ఆర్థిక మంత్రి, వైస్ ఛాన్సలర్ లార్స్ క్లింగ్‌బీల్ అయితే, మధ్యప్రాచ్యంలో ట్రంప్ అనుసరిస్తున్న తప్పుడు విధానాలు జర్మనీ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని కూడా ఫిర్యాదు చేశారు.

సంఘర్షణను ముగించేందుకు ఇరాన్ మత వ్యవస్థలోని ఒక అత్యున్నత వ్యక్తితో అమెరికా చర్చలు జరుపుతోందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, పాకిస్థాన్ ద్వారా అందించిన శాంతి ప్రణాళికను తెహ్రాన్ తిరస్కరించిందని ఇరాన్ ప్రభుత్వ టీవీ బుధవారం తెలిపింది.

**ఇరాన్ ఇంధన కేంద్రాలపై దాడి చేస్తామన్న ట్రంప్ బెదిరింపు**

ప్రస్తుతం జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఆయన ఆ బెదిరింపును విరమించుకున్నారు. కాగా, ఇది ఐరోపా మిత్రదేశాలను కలవరపరిచింది. ఆ దేశాలన్నీ ఉద్రిక్తతలను తగ్గించాలని పిలుపునిచ్చాయి, అంతేకాక ఈ సంఘర్షణలో సైనికపరంగా జోక్యం చేసుకోవద్దని కోరాయి. గాజా శాంతి ప్రణాళిక, ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో జరుగుతున్న హింసాకాండపై నుండి యుద్ధం దృష్టిని మళ్లించిందని బ్రిటన్ విదేశాంగ మంత్రి ఇవెట్ కూపర్ మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు.

ఉక్రెయిన్‌పై రష్యా పూర్తిస్థాయి దండయాత్ర ప్రారంభమై నాలుగేళ్లకు పైగా గడిచిన నేపథ్యంలో, ఉక్రేనియన్ ప్రతిఘటనకు మద్దతు, రష్యాపై ఒత్తిడి కొనసాగుతాయని బారోట్ ఎఎఫ్‌పికి తెలిపారు.






“ పెట్రోల్, డీజిల్ ధరలు యథాతథంగా ఉంటాయి. వాటిని పెంచే ఆలోచన లేదు. పుకార్లను, వదంతులను నమ్మవద్దు. ఇప్పటి పరిస్థితిని బట్టి 26 రాష్ట్రాలకు 22 వేల టన్నుల వాణిజ్య ఎల్‌పిజి సరఫరా చేశాం. గత 25 రోజుల్లో 2.5 లక్షల కొత్త పిఎన్‌జి (పైప్డ్ నేచరల్ గ్యాస్) కనెక్షన్లను ఇచ్చాం. పైపు ద్వారా సహజవాయువును సరఫరా చేసే సదుపాయం ఉన్నచోట దానికి మారకుండా ఉన్న కుటుంబాల ఎల్‌పిజి కనెక్షన్లను రద్దు చేస్తాము. గ్యాస్‌నెట్ వర్క్‌ను విస్తరించడానికి, ఒకే ఇంధన సౌకర్యం మీద ఆధారపడకుండా చూడడానికి ఈ ఏర్పాటును ఉద్దేశించాము. కేంద్రం వద్ద పెట్రోల్, డీజిల్ నిల్వలు చాలినంతగా ఉన్నాయి. చమురు శుద్ధికర్మాగారాలలో దేశీయ ఎల్‌పిజి ఉత్పత్తిని పెంచాము. 7500 వాణిజ్య, గృహ సంబంధ కనెక్షన్లను కొత్తగా ఇచ్చాము. అయితే వినియోగదారులు యుద్ధ భయంతో వీలైనన్ని ఎక్కువ సిలిండర్ల కోసం పానిక్ బుకింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ”

* – సుజాత శర్మ, సంయుక్త కార్యదర్శి, పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ

## వే'మన'పద్యం

**కులములోన నొకడు గుణవంతుడుంటిన**
**కులము వెలయు వాని గుణముచేత**
**వెలయు వనములోన మలయజమున్నట్లు**
**విశ్వదాభి రామ వినురవేమ.**



## సంపాదకీయం

# నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ

దేశావ్యాప్తంగా నియోజకవరాల సరిహద్దులను తిరిగి నిర్ణయించి ఆ మేరకు లోక్ సభలో, శాసనసభల్లో ఆయా రాష్ట్రాలకు పెరగనున్న స్థానాల సంఖ్యను నిర్ధారించే నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియను ముందుకు జరిపి 2011 నాటి జనాభాలెక్కల ప్రకారమే దానిని ఖరారు చేయాలని కేంద్రంలోని ఎన్ డి ఎ ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు వార్తలు చెబుతున్నాయి. ఆ మేరకు ఈ లోక్ సభ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్ట దలచినట్టు సమాచారం.ఈ వ్యవహారం పూర్తిగా దేశ జనాభా వృద్ధి, క్షయాలకు సంబంధించినది. కుటుంబ నియంత్రణను పాటించి అభివృద్ధి ని సాధించాలని చెప్పుకున్న సంకల్పానికి అనుగుణంగా దక్షిణాది రాష్ట్రాలు నడచుకున్నాయి. అందుచేత వాటి జనాభా పరిమితమైంది. ఉత్తరాది రాష్ట్రాలు దీనిని పెడ చెవిని పెట్టడం వల్ల అధిక జనభారంతో కునారిల్లు తున్నాయి.2011 జనాభా లెక్కల ప్రకారం ఉత్తర భారతం లోని ఒక్క ఉత్తర ప్రదేశ్ జనాభా దాదాపు 20 కోట్లు, అంటే 199,813,341.బీహార్ : 10 కోట్లు పైనే.మహారాష్ట్ర 11 కోట్లు పైన, పశ్చిమ బెంగాల్ :9 కోట్ల పైన, అదే సమయంలో తమిళనాడు లో 7 కోట్ల జనాభా మాత్రమే ఉంది. కేరళ మూడు కోట్ల 34 లక్షల పైచిలుకు,అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ జనాభా 8 కోట్ల మీదు మాట.వాస్తవానికి 2026 జనాభా లెక్కల తర్వాత నియోజకవరాల పునరవ్యవస్థీకరణ జరపాలని పార్లమెంటు చట్టం స్పష్టం చేసింది. ప్రస్తుతం పార్లమెంట్ లోని స్థానాలు 543.ఒక్క ఉత్తరప్రదేశ్ కే 80 స్థానాలున్నాయి.1971 జనాభా లెక్కల ప్రకారం పార్లమెంట్ స్థానాలను 543 వద్ద ఆపేశారు. 1976 లో ఈ నిర్ణయం తీసుకున్నారు.ఆ తర్వాత పునర్వ్యవస్థీకరణ చాలకాలం డేకడం, మధ్యలో కోవిడ్ -19 దాపురించి జనగణన వాయిదా పడడం, ఇప్పుడిప్పుడే దానికి సన్నాహాలు ప్రారంభం కావడం తెలిసిందే. ఉన్నట్టుండి పాత జనాభా ప్రకారం పునర్ వ్యవస్థీకరణను బిజెపి ప్రభుత్వం తలపెట్టడం వెనుక రహస్యం ఏమిటి?చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ల చట్టం ఈ ప్రక్రియతోనే ముడిపడి ఉంది. 2029 లో జరిగే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లను అమల్లోకి తేనున్నారు. అయితే ఉత్తరాది, దక్షిణాది తేడాలు రాకుండా అన్ని రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంచనున్నారనే సమాచారం చక్కర్లు కొడుతోంది.ఇది కూడా దక్షిణాదికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని ముఖ్యమంత్రి రేవంతరెడ్డి చేసిన విమర్శ గమనించదగినది.లోక్ సభ స్థానాల్లో అందరికీ 50 శాతం పెంపును వర్తింపజేస్తే దేశ రాజకీయాల్లో యుపి వంటి రాష్ట్రాల ఆధిపత్యం, పట్టు మరింత ప్రబలమవుతుంది. కేవలం ఆ ఒకటి రెండు రాష్ట్రాలను మచ్చిక చేసుకుంటే దేశాధికారాన్ని కైవసం చేసుకోగల అవకాశం ఏర్పడుతుంది. అందుచేత కుటుంబ నియంత్రణను పాటించి జనాభాను పరిమితం చేసినందుకు కానుకగా పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని పెంచి ఉత్తరాది ప్రాబల్యాన్ని తగు రీతిలో కుదించవలసి ఉంది.



## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# వికసించకుండా రాలుతున్న మొగ్గలు

ఏ దేశంలో అయినా బాలలే రేపటి పౌరులు. అలాంటి బాలల భవిష్యత్తు పాలకుల విధానం పై ఆధారపడి ఉంది. బాల పరిస్థితే ఆ దేశ పరిస్థితికి, ఆర్థిక విధానాలకు అద్దం పడుతుంది.

ప్రపంచ జనాభాలో పిల్లలు 25% ఉన్నారు. వీరిలో సుమారు 16.8 కోట్ల మంది బాల కార్మికులుగా ఉన్నారు. ప్రతి 10 మందిలో ఒకరు ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉన్నారని అంతర్జాతీయ కార్మిక సంస్థ ( ఐ ఎల్వో) అంచనా వేసింది. సుమారు 3.6 కోట్ల మంది పిల్లలు బానిస బ్రతుకులు గడుపుతున్నారని ఆస్ట్రేలియాకు చెందిన మానవ హక్కుల బృందం ద వాక్ ఫ్రీ ఫౌండేషన్ నివేదిక పేర్కొంది. పేదరికం, నిరక్షరాస్యత, అక్రమ రవాణా వంటి వాటి వల్ల ఎంతో మంది పిల్లలు బాల కార్మికులుగా మగ్గి పోతున్నారు. తీవ్రమైన దోపిడీ దౌర్జన్యాలకు గురౌతున్నారు. బాల కార్మిక వ్యవస్థ వల్ల విద్య, ఆరోగ్యం వంటి ప్రాథమిక హక్కులు హరించబడుతున్నాయి. లైంగిక, ఆర్థిక దోపిడీకి గురౌతున్నారు.

భారతదేశ బాల పరిస్థితి : ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన భారతదేశ లో 23,68,17,000 మంది పిల్లలు ఉన్నారు. వీరిలో 11.45% మంది పిల్లలు బడికి దూరంగా ఉన్నారు. అంటే ప్రతి వంద మంది పిల్లల్లో 11 మంది పాఠశాలకు దూరంగా ఉన్నారు. దీన్ని గణాంకాలు, కార్యక్రమాల మంత్రిత్వ శాఖ 8-12-2025 విడుదల చేసింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రకారం భారతదేశంలో 5 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సులోని కోటి,ఒక లక్ష మంది పిల్లలు పనుల్లో కొనసాగుతున్నారు. బాల కార్మిక శ్రమశక్తిలో 14 నుంచి 17 సంవత్సరాల పిల్లలు సుమారు 63 శాతం ఉన్నారని ' సేవ్ ది చిల్డ్రన్' సంస్థ తెలిపింది. యూనిసెఫ్ నివేదిక ప్రకారం పట్టణ ప్రాంతంలో 5-14 ఏళ్ల వయస్సులోని బాల కార్మికుల్లో 54% పెరుగుదల కనిపించింది.

భారతదేశ రాజ్యాంగంలో సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, వ్యక్తి గౌరవం ఆధారంగా కొత్త సామాజిక వ్యవస్థను స్థాపించాలని, పేదరికం, అజ్ఞానం, అనారోగ్యాన్ని నిర్మూలించడం లక్ష్యంగా పేర్కొన్నది. 78 సంవత్సరాల 'స్వతంత్ర' పాలనలో అవి అమలు జరగలేదు. 2025 నాటికి బాల కార్మికులను నిర్మూలించాలన్న ఐక్య రాజ్య సమితి లక్ష్యం భారతదేశానికి ఆచరణ సాధ్యం కాదని పార్లమెంటరీ స్టాండింగ్ కంపెనీ తన 52వ నివేదికలో పేర్కొంది. ఆర్టికల్ 24 ప్రకారం 6-17 సంవత్సరాల లోపు బాల బాలికలను ప్రమాదకరమైన పనుల్లో పెట్టుకోరాదు. ఆర్టికల్ 39 ప్రకారం బాలికల ఆరోగ్య పరిరక్షణకు ఆటంకంగా ఉండే పరిస్థితులను తొలగించాలి. ఆర్టికల్ 45 ప్రకారం 6 ఏళ్ల లోపు బాల, బాలికల అందరికీ ఉచిత విద్య, సంరక్షణ అందించాలి. జాతీయ బాలలకు అన్ని విధాల రక్షణ, హక్కులను కాపాడాలని కేంద్ర మంత్రిత్వ శాఖ, బాల కార్మిక చట్టం 1986కు సవరణ చేసింది. దీని ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలను ఎలాంటి పనుల్లో చేర్చ గూడదు. వారు బడిలో చదువుకోవాలి. ఇవేవీ అమలు జరగకుండా రాజ్యాంగంలో అలంకార ప్రాయంగా ఉన్నాయి.

ప్రతి బిడ్డకు సమాన అవకాశాలు,



హక్కుల రక్షణ, పూర్తి భాగస్వామ్యం గురించి (ది పర్సన్ విత్ డిజ్ బులిట్ యాక్ట్) జనవరి 1,1996న చేసిన తీర్మానంతో సహా ఐక్య రాజ్య సమితి అన్ని తీర్మానాల పైనా భారతదేశం సంతకం చేసింది. ఆచరణ మాత్రం సంతకాలకే పరిమితమైంది.

ఐక్య రాజ్య సమితి తీర్మానాలకు భిన్నంగా భారత బాలల పరిస్థితులు ఉన్నాయి. ప్రపంచంలోని పోషకాహార లోపంలో ఉన్న మూడవ బిడ్డ భారతదేశంలో ఉన్నారు. దేశంలోని నలుగురు పిల్లల్లో ముగ్గురు రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రతి రెండవ బిడ్డ బరువు తక్కువగా ఉన్నాడు. ప్రాథమిక విద్యలోనే చదువు మానేసే పిల్లలు 71.01% ఉన్నారు. దేశం మొత్తంలో 11కోట్ల,4లక్షల మంది బాల కార్మికులుగా ఉన్నారు. తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు 44% ఉన్నారు. 3 సంవత్సరాలకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల్లో 79% మంది పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు.

భారతదేశంలో పిల్లల పరిస్థితులు చాలా దుర్భరంగా ఉన్నాయి. చాలా మంది పిల్లలకు బ్రతికే అవకాశం తక్కువగా ఉంది. వారికి ఆహారం లభించక పోవడమే కాదు, విద్యా అవకాశాలు కూడా లేవు. షెడ్యూల్డ్ కులాలు, తెగల బాలికలలో అక్షరాస్యత రేటు 42% మాత్రమే. వంద మంది బాలికల్లో 30 మంది మాత్రమే ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. వీరిలో ఇంకా బాల్య వివాహాలు కొనసాగుతూనే ఉన్నాయి.

పిల్లల ఎదుగుదల: భారతదేశంలో పిల్లల ఎదుగుదల చాలా తక్కువగా ఉంది. ఆర్థిక పరిస్థితులే కాకుండా కులం కూడా అవరోధంగా ఉంది. అగ్రకుల పెత్తందారీ, ఆర్థిక సామాజిక తరగతుల పిల్లలతో పోలిస్తే, పేదల అణగారిన తరగతులకు చెందిన చిన్నారుల ఎదుగుదల లోపం అధికంగా ఉంది. ఆదివాసి మరియు దళిత పిల్లల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. 5 ఏళ్ల లోపు పిల్లల్లో 35% మంది ఎదుగుదల సమస్యతో బాధపడుతున్నారు. ప్రపంచంలోని ఇతర దేశాలే కాదు, సబ్- సహారా లోని ఆఫ్రికా దేశాల కన్నా భారతదేశంలోని పిల్లల్లోనే ఎదుగుదల లోపం ఎక్కువగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఎదుగుదల లోపంతో బాధపడుతున్న పిల్లల్లో దాదాపు 70% మంది భారత్, ఆఫ్రికా దేశాల్లోనే ఉన్నారు. వీరిలో 35.7% భారత్ లో ఉంటే, ఆఫ్రికాలో 33.6% ఉన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్య పూరిత విధానాలు, పేదరికం, పోషకాహార లోపం వల్ల పిల్లలు ఎదుగుదల సమస్యను ఎదుర్కొంటున్నారని నిపుణుల విశ్లేషణలు చెబుతున్నాయి.

బాల కార్మికులుగా ప్రమాదకరమైన పనుల్లో పని చేయడం వల్ల మరియు పోషకాహార లోపం వల్ల ప్రతి సంవత్సరం భారతదేశంలో లక్షలాది మంది బాలలు చనిపోతున్నారు. 2015లో 5సంవత్సరాల లోపు చిన్నారుల 10 లక్షలకు పైగా మరణించారు. ఇది ఆ సంవత్సరంలో ప్రపంచం మొత్తం మీద అత్యధికమని ప్రముఖ 'లాన్సెట్ 'పత్రిక తెలిపింది.

బడికి వెళ్లి ఆట పాటలతో జీవించాల్సిన పిల్లలు బడికి దూరమై బాల కార్మికులుగా పోషకాహార లోపం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూ ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకు కారణం వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితులే కారణం. గత ప్రభుత్వాలు ముఖ్యంగా నేటి మోడీ ప్రభుత్వం పేదల కోసం కాకుండా, బడా పెట్టుబడిదారుల, బడా భూస్వాముల, సంపన్న వర్గాల, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసం పని చేశాయి,చేస్తున్నాయి. మోదీ ప్రభుత్వం ప్రభుత్వ దేశ సంపదలను, సహజ వనరులను అదాని, అంబాని లాంటి బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతున్నది. సెజ్ లు, పరిశ్రమల పేరుతో భూములు కూడా వారికి కట్ట బెడుతున్నది. దేశ సంపద, భూములు కొద్ది మంది వద్ద కేంద్రీకృతమై ఉంది. ఫలితంగా గ్రామీణ పేదలు భూమికి దూరం ఉపాధికి దూరం కాగా, పట్టణ పేదలు ఉపాధికి దూరమై పేదరికంలో మగ్గుతున్నారు. పేదరికం ఫలితంగా బడికి దూరమై కుటుంబ పోషణలో పిల్లలు బాల కార్మికులుగా మారుతున్నారు. ఫ్యాక్టరీల ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారు. పిల్లలు ఈ పరిస్థితుల నుంచి బయట పడాలంటే గ్రామీణ పేదలకు భూ పంపిణీ జరగాలి.వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి ఉపాధిని కల్పించాలి. ప్రజా అవసరాలను తీర్చే పరిశ్రమలు నెలకొల్పి శ్రామికులకు పని కల్పించి పరిశ్రమల్లో భాగస్వామ్యం ఇవ్వాలి. పట్టణ పేదలకు ఉపాధి కల్పించాలి. అలాంటి విధానాలను కేంద్రంలో మోడీ ప్రభుత్వం, అమలు చేయదు. దాని వర్గ స్వభావం అందుకు వ్యతిరేకం. దాన్ని గ్రహించి పేదలే ఉద్యమం ద్వారా సాధించుకోవాలి.



బొల్లిముంత సాంబశివరావు
+919885983526

# మరణం ప్రకృతి సిద్ధమైన విశ్రాంతి!

మనుష్యుడు పుట్టిన క్షణం నుంచి మరణం వైపు ప్రయాణిస్తున్నాడని చెప్పడం అతిశయోక్తి కాదు. కానీ ఈ సత్యాన్ని అంగీకరించడం, అర్థం చేసుకోవడం మాత్రం చాలా కష్టం. మరణం అనేది కేవలం జీవితం ముగింపు మాత్రమే కాదు, అది మన ఉనికి అత్యంత ముఖ్యమైన భాగం. ఇది ఒక మజిలీ జీవిత రైలు ప్రయాణంలో ఆగవలసిన ఒక అనివార్యమైన స్టేషన్. మనం ఎంత వద్దనుకున్నా, ఎంత భయపడినా ఈ గమ్యం రాక మానదు. అయితే, ఆ ప్రయాణాన్ని మనం ఎలా చూస్తామనేదే మన జీవన మాధుర్యాన్ని నిర్ణయిస్తుంది.

**మరణం పట్ల మన ప్రాచీన దృష్టికోణం:**

భారతీయ సంస్కృతిలో మరణాన్ని ఎప్పుడూ ఒక భయంకరమైన లేదా అశుభకరమైన విషయంగా చూడలేదు. మన పూర్వీకులు దీనిని జీవిత చక్రంలో ఒక సహజ భాగంగా, ఒక పరిణామ ప్రక్రియగా అంగీకరించారు. మరణం కూడా ఒక గొప్ప సంస్కారంగా, ఆత్మ పరివర్తనగా పరిగణించబడింది. ఇది ఒక పాత అధ్యాయం ముగిసి, మరొక సరికొత్త అధ్యాయం ప్రారంభమయ్యే సంధి క్షణం.మన సనాతన ధర్మంలోని పునర్జన్మ సిద్ధాంతం ప్రకారం, మరణం అనేది ఆత్మ ఒక పాత శరీరాన్ని విడిచి మరొక నూతన శరీరంలోకి ప్రవేశించే సరళమైన ప్రక్రియ. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి విషాద యోగంలో ఒక అద్భుతమైన సత్యాన్ని బోధించాడు "వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి, తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ"దీని అర్థం చాలా స్పష్టం మనిషి చిరిగిపోయిన పాత బట్టలను విడిచిపెట్టి కొత్త బట్టలను ఎలాగైతే ధరిస్తాడో, ఆత్మ కూడా అలసిపోయిన, ముసలితనంతో ఉన్న శరీరాన్ని విడిచి కొత్త దేహాన్ని పొందుతుంది. ఇక్కడ దుఃఖానికి తావు లేదు, కేవలం మార్పు మాత్రమే ఉంది.

**మజిలీ అనే భావన: ప్రయాణంలో విశ్రాంతి:**

రైలు ప్రయాణంలో ప్రతి మజిలీకి ఒక ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. కొన్ని స్టేషన్లు చిన్నవిగా ఉండవచ్చు, మరికొన్ని జంక్షన్లలా పెద్దవిగా ఉండవచ్చు. కొన్ని ప్రదేశాలు ప్రకృతి సౌందర్యంతో పరవశింపజేస్తే, మరికొన్ని సామాన్యంగా ఉంటాయి. కానీ ఏ స్టేషన్ కూడా శాశ్వతం కాదు. ప్రతి మజిలీ ప్రయాణికుడికి తన అంతిమ గమ్యాన్ని చేరుకోవడానికి అవసరమైన ఒక మెట్టు మాత్రమే.అదే విధంగా జీవితంలో మనం ఎదుర్కొనే ప్రతి అనుభవం, ప్రతి కష్టం, ప్రతి సుఖం మన ఆధ్యాత్మిక ప్రయాణంలో ఒక మజిలీ వంటిది. మరణం కూడా అలాంటి ఒక మజిలీయే. ఇది భయపడవలసిన భీభత్సం కాదు, అలాగని త్వరగా రావాలని ఎదురుచూడవలసిన విషయం కూడా కాదు. ఇది ఒక నిర్ణీత సత్యం. రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి తన గమ్యం రాగానే లగేజీ సర్దుకుని దిగడానికి ఎలా సిద్ధంగా ఉంటాడో, జీవితం అనే ప్రయాణంలో ఉన్న మనం కూడా మరణం అనే స్టేషన్ రాగానే ఈ దేహాన్ని విడిచి వెళ్ళడానికి మానసిక సిద్ధత కలిగి ఉండాలి.

**జీవిత దశలు - మజిలీ ప్రాముఖ్యత:**

మనం మరణాన్ని ఒక్కసారిగా వచ్చే ముగింపుగా చూస్తాం కానీ, నిజానికి మనం పుట్టినప్పటి నుంచి ఎన్నో చిన్న మరణాలను దాటుకుంటూ వస్తాం.బాల్యం, ఇది మన మొదటి మజిలీ. ఇక్కడ మనకు ఏమీ తెలియదు, అంతా అమాయకత్వం. కానీ యౌవనం రావాలంటే ఆ బాల్యం మరణించక తప్పదు.యవ్వనం, రెండో మజిలీ. ఇక్కడ కలలు, ఆశలు, శక్తి ఉరకలేస్తాయి. కానీ వృద్ధాప్యం రావాలంటే ఈ యవ్వన దశ ముగియాల్సిందే. వృద్ధాప్యం, ఇది అనుభవాల సారం కలిగిన మూడవ మజిలీ. ఇక్కడ శరీరం అలసిపోతుంది, మనస్సు ప్రశాంతతను కోరుకుంటుంది. ప్రతి దశలో మనం ఏదో ఒక విషయాన్ని విడిచిపెడుతూనే ఉన్నాం చిన్ననాటి ఆటబొమ్మలు, యౌవనపు ఆవేశాలు, మధ్య వయసులోని ఆరాటాలు. మరణం కూడా అలాంటి ఒక గొప్ప విడుదల.ఇది పంచభూతాలతో తయారైన శరీరం నుంచి నిత్యమైన ఆత్మ విముక్తి. గబ్బిలాలు చీకటిలోనే బతుకుతాయి కాబట్టి వాటికి వెలుగు అంటే భయం. కానీ ప్రకృతిలో వెలుగే నిజం, చీకటి అనేది కేవలం వెలుగు లేని స్థితి మాత్రమే. మరణం కూడా అంతే, అది చీకటి కాదు, మన కంటికి కనపడని ఒక మహా వెలుగులోకి ప్రవేశం.

**మరణ భయం వెనుక ఉన్న రహస్యం:**

మానవుడు సహజంగానే తెలియని (Unknown) విషయాలకు భయపడతాడు. మరణం తర్వాత ఏముంది? ఎక్కడికి వెళ్తాం? అనే అనిశ్చితి ఈ భయాన్ని పెంచుతుంది. కానీ ఒకసారి ఆలోచించండి, మనం రోజూ రాత్రి నిద్రపోతాం. నిద్రపోయేటప్పుడు రేపు ఉదయం మేల్కొంటామో లేదో మనకు తెలియదు. నిద్రను చిన్న మరణం అని కూడా అంటారు. అయినా మనం నిశ్చింతగా నిద్రపోతాం. ఎందుకంటే నిద్ర అనేది శరీరానికి అవసరమైన విశ్రాంతి అని మనకు తెలుసు.మరణం కూడా ప్రకృతి సిద్ధమైన విశ్రాంతి వంటిదే. విశ్వంలో ప్రతిదీ ఒక చక్రీయ గమనంలో (Cyclic Motion) ఉంటుంది. పగలు తర్వాత రాత్రి రావడం ఎంత సహజమో, చలికాలం తర్వాత వసంతం రావడం ఎంత నిజమో, జననం తర్వాత మరణం కూడా అంతే ప్రకృతి నియమం. ఈ నియమాన్ని హృదయపూర్వకంగా అర్థం చేసుకున్న వ్యక్తికి మరణ భయం ఉండదు, కేవలం గౌరవం మాత్రమే ఉంటుంది.

**మరణం మనకు నేర్పించే జీవన పాఠాలు:**

విచిత్రంగా అనిపించినా, మరణం గురించిన స్పృహే మనకు నిజంగా ఎలా జీవించాలో నేర్పుతుంది. మనం ఇక్కడ శాశ్వతంగా ఉండిపోతామని అనుకుంటే, సమయం విలువ తెలియదు. కానీ మన సమయం పరిమితం అని తెలిసినప్పుడు, ప్రతి క్షణం అమూల్యంగా మారుతుంది.మహాత్మా గాంధీ ఒకచోట ఇలా అన్నారు.మీరు రేపే మరణిస్తారని భావించి జీవించండి, ఎప్పటికీ జీవిస్తారని భావించి నేర్చుకోండి.ఈ మాటల్లోని అంతరార్థం ఏమిటంటే, మరణం అవగాహన మనల్ని మరింత బాధ్యతాయుతంగా, ప్రేమగా జీవించేలా చేస్తుంది. మనం చేసే



ప్రతి పనిలో ఒక అర్థం ఉంటుంది. ఇతరులతో గొడవలు పడటానికి, ద్వేషించడానికి మన దగ్గర తగినంత సమయం లేదని మరణం మనకు గుర్తుచేస్తూనే ఉంటుంది.ప్రపంచ సంస్కృతులలో మరణం ప్రపంచవ్యాప్తంగా వివిధ మతాలు, సంస్కృతులు మరణాన్ని భిన్నంగా విశ్లేషించాయి:టిబెటన్ బౌద్ధంలో వీరు 'బార్డో' (Bardo) అనే స్థితిని నమ్ముతారు. అంటే మరణం తర్వాత, పునర్జన్మకు ముందు ఉండే ఒక ప్రయాణ మార్గం. ఈజిప్షియన్లు మరణానంతర జీవితం ఉంటుందని నమ్మి, దేహాలను మమ్మీలుగా భద్రపరిచారు.క్రైస్తవం & ఇస్లాం లు ఇవి తీర్పు దినం, స్వర్గం, నరకం గురించి వివరిస్తాయి. మన భూమి మీది ప్రవర్తనను బట్టి అక్కడ స్థానం ఉంటుందని చెబుతాయి. హిందూ ధర్మం లో ఇది అన్నింటికంటే ఒక అడుగు ముందుకేసి మోక్షం గురించి మాట్లాడుతుంది. అంటే జనన మరణ చక్రం నుండి శాశ్వత విముక్తి. ఈ పరమపద సోపానాన్ని చేరుకోవాలన్నా మరణం అనే వాకిలి దాటక తప్పదు.

**వైజ్ఞానిక, తాత్విక కోణం:**

ఆధునిక వైద్య విజ్ఞానం మరణాన్ని కేవలం గుండె కొట్టుకోవడం ఆగిపోవడం లేదా మెదడు పని చేయక పోవడంగా చూస్తుంది. కానీ క్వాంటం ఫిజిక్స్ లోని శక్తి నిత్యత్వ నియమం (Law of Conservation of Energy) ప్రకారం, శక్తి ఎప్పుడూ నాశనం కాదు, అది కేవలం ఒక రూపం నుండి మరొక రూపంలోకి మారుతుంది. $E = mc2$ అన్న సూత్రం ప్రకారం పదార్థం శక్తిగా మారవచ్చు. మన శరీరం కూడా ఒక శక్తి స్వరూపమే. మరణం అనేది కేవలం ఆ శక్తి రూపాంతీకరణ (Transformation). సైన్స్, ఆధ్యాత్మికత ఇక్కడ ఏకీభవిస్తాయి మరణం అంతం కాదు, అది ఒక మార్పు మాత్రమే.

**మరణాన్ని హుందాగా ఎదుర్కోవడం ఎలా?**

రవీంద్రనాథ్ ఠాగూర్ మరణాన్ని జీవితం చివరి సంగీత కచేరీ అని వర్ణించారు. ఎంతటి అద్భుతమైన భావన! జీవితం అంతా ఒక ప్రదర్శన అయితే, మరణం దాని గంభీరమైన ముగింపు (Climax). ఆ ముగింపు గౌరవప్రదంగా ఉండాలంటే మనం కొన్ని విషయాలను పాటించాలి. మనం చేసిన మంచి పనులే మరణ సమయంలో మనకు తోడుగా ఉండే నిజమైన సంపద. అవి మనకు మానసిక శాంతిని ఇస్తాయి. బంధుమిత్రులతో, తోటివారితో ప్రేమగా ఉండటం వల్ల మన ఉనికి వారి జ్ఞాపకాల్లో చిరంజీవిగా ఉంటుంది.ధ్యానం, యోగా వంటివి మరణం పట్ల ఉండే తెలియని భయాన్ని పోగొట్టి, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి. పోయేటప్పుడు ఏదీ వెంటరాదు అనే సత్యాన్ని గ్రహించి, నిరాడంబరంగా జీవించడం నేర్చుకోవాలి.

**మజిలీ ముగింపు - కొత్త ప్రయాణారంభం:**

రైలు ప్రయాణంలో ప్రతి స్టేషన్ వద్ద కొందరు దిగుతారు, కొందరు కొత్తగా ఎక్కుతారు. మన జీవిత ప్రయాణంలో కూడా తల్లిదండ్రులు, స్నేహితులు, పిల్లలు ఇలా ఎందరో వచ్చి వెళ్తుంటారు. ఎవరి మజిలీ రాగానే వారు దిగిపోవాల్సిందే. ఆ స్టేషన్ రాగానే దుఃఖించడం కంటే, అంతవరకు కలిసి ప్రయాణించినందుకు కృతజ్ఞతతో ఉండటం మిన్న.మరణం మన గమ్యం కాదు, అది మరొక ప్రయాణానికి మారే ఒక జంక్షన్. ఈ అవగాహన ఉన్న మనిషి స్వేచ్ఛగా, నిర్భయంగా జీవించగలడు. మనం భయపడవలసింది మరణానికి కాదు, అసలు జీవించకుండానే మరణిస్తామేమో అని! ప్రతి రోజూ అర్థవంతంగా జీవించే వ్యక్తికి మరణం ఒక పండగలా అనిపిస్తుంది.మరణం ఒక మజిలీ ఈ చిన్న వాక్యం వెనుక అనంతమైన వేదాంతం దాగి ఉంది. జీవితం ఒక ప్రయాణం అయితే, మరణం ఆ ప్రయాణంలో ఒక అనివార్యమైన విశ్రాంతి స్థలం. ఈ మజిలీని భయంతో కాకుండా, గౌరవంతో అంగీకరించినప్పుడు మన జీవితం మరింత సంపూర్ణంగా మారుతుంది. మనం ప్రతిరోజూ ఎన్నో పాత విషయాలను విడిచిపెడుతున్నాం పాత ఆలోచనలు, మొండి పట్టుదలలు, అహంకారం. ఇవన్నీ ఒక రకమైన మరణాలే. ఈ చిన్న మరణాలు మనల్ని గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దుతాయి. అంతిమ మరణం కూడా అలాంటి ఒక పరిణామ ప్రక్రియే.కాబట్టి మరణం గురించి ఆలోచించండి, కానీ దాని గురించి భయపడి ప్రస్తుత జీవితాన్ని నాశనం చేసుకోకండి. దానికి మానసికంగా సిద్ధంగా ఉండండి, కానీ అదే సమయంలో ప్రతి క్షణాన్ని మనస్ఫూర్తిగా అనుభవించండి. మంచిగా జీవించినవాడికి మరణం ఒక తీపి జ్ఞాపకంలా మారుతుంది. ప్రేమ, కరుణ, ధర్మం అనే బాటలో నడుస్తూ, ఈ జీవిత ప్రయాణాన్ని ఆస్వాదిద్దాం. చివరి మజిలీ చేరే లోపు లోకానికి ఎంతో కొంత మేలు చేద్దాం. అదే మరణానికి మనం ఇచ్చే గొప్ప వీడ్కోలు!



- డా.సూర్యదేవర రామకృష్ణ,
+91 9490754169

## విద్యా విధానం సవాళ్లు - సమతుల్య పరిష్కారాలు

విద్య అనేది ఒక సమాజ భవిష్యత్తును నిర్ణయించే పునాది. రాష్ట్రంలో ఇటీవల విద్యా వ్యవస్థపై జరుగుతున్న చర్చ, ముఖ్యంగా ప్రభుత్వ వర్సెస్ ప్రైవేట్ పాఠశాలల అంశం, ఒక ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సంకేతం. సీఎం రేవంత్‌రెడ్డి "పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపాలి" అని పిలుపునివ్వడం వెనుక ప్రభుత్వ విద్యపై భరోసా కల్పించాలనే ఆకాంక్ష కనిపిస్తోంది. అయితే, ఈ ఆకాంక్ష వాస్తవరూపం దాల్చాలంటే భావోద్వేగాల కంటే వ్యవస్థాగత మార్పులే కీలకం.ప్రభుత్వ పాఠశాలల్లో అత్యంత ప్రతిభావంతులైన, కఠినమైన పోటీ పరీక్షల ద్వారా ఎంపికైన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారు. ఇది ప్రభుత్వ వ్యవస్థకు ఉన్న అతిపెద్ద బలం. మౌలిక సదుపాయాల కొరత: సరిపడా గదులు, స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఆట స్థలాల లేమి.పర్యవేక్షణ లోపం: బోధన నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ లేకపోవడం. ఆంగ్ల మాధ్యమం: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆంగ్ల బోధనలో ఇంకా పూర్తి స్థాయి పట్టు సాధించకపోవడం. సీఎం రేవంత్‌రెడ్డి అన్నట్లుగా, విద్యా వ్యవస్థపై నమ్మకం కలగాలంటే అది పైస్థాయి నుంచి మొదలవ్వాలి. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినప్పుడే సామాన్య ప్రజల్లో ఆ వ్యవస్థపై ధీమా పెరుగుతుంది. ఇది కేవలం ఒక నియమంలా కాకుండా, ఒక నైతిక బాధ్యతగా మారినప్పుడే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారతాయి. ప్రైవేట్ పాఠశాలలను కేవలం వ్యాపార సంస్థలుగా చూడటం సరికాదు. లక్షలాది మంది విద్యావంతులకు ఇవి ఉపాధినిస్తున్నాయి. ప్రభుత్వ వ్యవస్థ కంటే మెరుగైన ఫలితాలు ఇవ్వాలనే పోటీ తత్వం విద్యార్థులకు మేలు చేస్తోంది.సాంకేతికతను, కొత్త బోధనా పద్ధతులను త్వరగా అందిపుచ్చుకోవడంలో ఇవి ముందుంటున్నాయి. బడ్జెట్‌లో విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా, ఆ నిధులు క్షేత్రస్థాయిలో సద్వినియోగం అయ్యేలా చూడాలి. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులు, కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి.అవసరమైన చోట ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో వసతులను మెరుగుపరచాలి. బోధనలో ఉత్తమ ఫలితాలు సాధించే ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ, అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకునే పారదర్శక వ్యవస్థ ఉండాలి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఒకే లక్ష్యం (విద్యార్థి వికాసం) కోసం పనిచేసే భిన్న మార్గాలు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా బలోపేతం చేసినప్పుడు, ప్రజలు స్వచ్ఛందంగా ప్రభుత్వ విద్య వైపు మొగ్గు చూపుతారు. సమగ్రమైన ప్రణాళిక, చిత్తశుద్ధి ఉన్న నాయకత్వం తోడైతేనే తెలంగాణ "జ్ఞాన తెలంగాణ"గా అవతరిస్తుంది.

డా.పూసపాటి వేదాద్రి
9912197694

# స్వయం ఉపాధి తో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



**జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు**

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 25(వుదయం జిల్లా ప్రతినిధి):** కుట్టు మిషన్ శిక్షణ క్రమశిక్షణతో నేర్చుకొని స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు అన్నారు బుధవారం ఐకెపి ఎపిఓ రాజన్న ఆధ్వర్యంలో మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలోని రైతు వేదికలో కుట్టు శిక్షణ కేంద్రంను ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు పాల్గొని కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సూరారం గ్రామసర్పంచ్ మేకల శంకరమ్మ తో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సంకల్పంతోనే రాష్ట్రప్రభుత్వం మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు మంథని నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఈ ప్రాంతంలో ప్రతి ఒక్కరు ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశంతో ముందుకు సాగుతున్నారని దానిలో భాగంగానే మహిళల అభివృద్ధి కోసం వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు సూరారం గ్రామంలో కుట్టు మిషన్లు ఏర్పాటు చేసి శిక్షణ కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు కుట్టు మిషన్లు నేర్చుకోవడానికి గ్రామలలోని యువత ఉత్సాహంగా ముందుకు వచ్చి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఈ కుట్టు మిషన్ కేంద్రం ద్వారా స్థానిక యువతులకు స్వయం ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆర్థికంగా బలపడే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్రనాథ్,తోపాటు పలు గ్రామాల సర్పంచులు అధికారులు శిక్షణ పొందే సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ శాఖ సేవలు అభినందనీయం

**పోలీస్ మెగా మెడికల్ క్యాంప్ లో 6200 మంది గిరిజనులకు ఉచిత వైద్య సేవలు**

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి మార్చి 25(వుదయం జిల్లా ప్రతినిధి):** జిల్లా పోలీస్ శాఖ సేవలు అభినందనీయం అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ శాఖ అడవి ముత్తారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పెగడపల్లి ఆశ్రమ పాఠశాలలో బుధవారం పోలీస్ మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హాజరయ్యారు మెగా మెడికల్ క్యాంపు ను ప్రారంభించారు ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి శిబిరాల ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స అందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎరైవ్ ఆలీవ్ కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు కూడా నిర్వహించామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మెడికల్ క్యాంపులు కొనసాగిస్తామని తెలిపారు.ఈ క్యాంప్ ద్వారా సుమారు 6200 మంది గిరిజనులకు ఉచిత వైద్య సేవలు అందించబడ్డాయి ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ (హైదరాబాద్), ఏకశిల హాస్పిటల్ (హనుమకొండ),
సిగ్మా హాస్పిటల్, కూరపాటి హాస్పిటల్స్, శరత్ లేజర్ ఐ కేర్ (హనుమకొండ), భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు చెందిన నిపుణులైన వైద్యులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. మొత్తం 34 మంది వైద్యులు 9 విభాగాల్లో సేవలు అందించారు.ఈ శిబిరంలో గుండె, మూత్రపిండాలు, జనరల్ మెడిసిన్, స్త్రీరోగాలు, కంటి, చర్మ, చెవిముక్కుగొంతు, ఎముకలు మరియు కీళ్ల సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించబడ్డాయి. అదనంగా రక్త పరీక్షలు, 2డి ఎకో, ఈసీజీ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిఎఫ్ఓ నవీన్ రెడ్డి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డిప్యూటీ డిఎంహెచ్ ఓ శ్రీదేవి, డీఎస్పీ, సూర్యనారాయణ, సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# మురుగు కూపంలో 18వ వార్డు!

**– పట్టించుకోని అధికారులు, పాలకులు!**
**- డ్రైనేజీలు నిండి ఇళ్లలోకి వస్తున్న మురుగునీరు**
**- రోగాల బారిన పడుతున్న చిన్నపిల్లలు, వృద్ధులు**
**- వాడ కౌన్సిలర్ నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం**



**పరకాల, మార్చి 25 (వుదయం ప్రతినిధి) :** పరకాల పట్టణంలోని 18వ వార్డులో మురుగునీటి సమస్య అధ్వాన్నంగా మారింది. ప్రతిరోజూ మున్సిపాలిటీ నల్లాలు వదిలిన సమయంలో, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు కాలువల్లో నుండి పొంగిపొర్లి రోడ్లపైకి, స్థానికుల ఇళ్లలోకి చేరుతోంది. డ్రైనేజీలు క్లియర్ చేయకపోవడంతో నీరు నిలిచిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని 18వ వార్డు ఇందిరమ్మ కమిటీ మెంబర్ పసుల శ్రీనివాస్ తెలిపారు. నిలిచిపోయిన మురుగునీటిపై ఈగలు, దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి ఆహార పదార్థాలపై వాలుతుండటంతో వార్డులో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఇప్పటికే పలువురు చిన్నపిల్లలు, వృద్ధులు జ్వరాలు, వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల పాలవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వార్డులో ఇంత జరుగుతున్నా స్థానిక కౌన్సిలర్ రేగూరి కర్ణ ఏమాత్రం పట్టించుకోవడం లేదని వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. సమస్యను పలుమార్లు వారి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని, మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి డ్రైనేజీలను శుభ్రం చేయించి తమకు ఆరోగ్య ముప్పు కలగకుండా చూడాలని వారు కోరుతున్నారు.

# మండల డిటిఎఫ్ అధ్యక్షుడు ఎన్ రాజశేఖర్ ఏకగ్రీవం

**డిటిఎఫ్ ఎన్నికల అధికారి దార్ల రవీందర్.**



**ఖానాపురం, మార్చి 25 (వుదయం ప్రతినిధి):** మండల ఉపాధ్యాయల డిటిఎఫ్ అధ్యక్షుడిగా ఎస్ రాజశేఖర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డిటిఎఫ్ ఎన్నికల అధికారి దార్ల రవీందర్ తెలిపారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు.మండల డిటిఎఫ్ అధ్యక్షుడిగా ఎన్ రాజశేఖర్,ఉపాధ్యక్షులు వి వాగ్య, కె నీరజ, ప్రధాన కార్యదర్శి పి సంతోష్ కుమార్, కార్యదర్శులు పి సురేందర్, కి సూరయ్య, వి శ్రీనివాస్, జిల్లా కౌన్సిలర్స్ కె యాకయ్య, కె కళ్యాణి, కె నర్సింహులు, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఏ హుస్సేన్, సభ్యులు బి ఈర్య, బి దివ్యశ్రీ తదితరులు ఏకగ్రీవం ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు కొమ్మలు, యాకయ్య, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె యాకయ్య, కొర్ర రమేష్, కె కొమురయ్య, ఎమ్ జగన్, శ్రీధరస్వామి, వి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# డీవీఆర్ ధర్మకాంట ప్రారంభించిన చల్లా ధర్మారెడ్డి




**పరకాల మార్చి 25 (వుదయం ప్రతినిధి):**

దామెర మండలం దుర్గంపేట గ్రామ ప్రధాన రహదారి పై నూతనంగా ఏర్పాటు చేసిన డీవీఆర్ ధర్మకాంటను బుధవారం రోజున పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులకు, వ్యాపారులకు ధర్మకాంట ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సదుపాయాలు పెరగడం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల తూకం ప్రక్రియ సులభతరం అవుతుందని అన్నారు. స్థానిక ప్రజలు, రైతులు ఈ ధర్మకాంటను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ధర్మకాంట ఏర్పాటుచేసిన నిర్వాహకులకు మాజీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక

# భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**




**జయశంకర్ భూపాలపల్లి మార్చి 25(వుదయం జిల్లా ప్రతినిధి):** భూపాలపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.బుధవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భూ వివాదాలకు సంబంధించిన అన్ని రికార్డులు, పొజిషన్ సమగ్రంగా పరిశీలించి నివేదికలను అందచేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.రెవెన్యూ మరియు అటవీ శాఖలకు సంబంధించిన భూ వివాదాల విషయంలో సంయుక్త సర్వేలు నిర్వహించడం ద్వారా హద్దులను నిర్ణయించాలని కలెక్టర్ స్పష్టంచేశారు. భూ సరిహద్దుల విషయంలో తలెత్తుతున్న సమస్యలను సమన్వయంతో పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు పనిచేయాలని సూచించారు. అలాగే, భూ సమస్యల పరిష్కార ప్రక్రియలో పారదర్శకత పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.ఈ సమావేశంలో అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, భూపాలపల్లి, గన్ పూర్,గోరి.కొత్తపల్లి, రేగొండ, చిట్యాల, టేకుమాట్ల, మొగుళ్ల పల్లి, మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైంది?

**కనీసం 15% కేటాయింపు చేస్తామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.**
**ఎస్ ఎఫ్ ఐ ఛలో అసెంబ్లీ ఉద్రిక్తం.**



**భూపాలపల్లి మార్చి 25 (వుదయం ప్రతినిధి):** విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐరాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన “ఛలో అసెంబ్లీ” ముట్టడి కార్యక్రమంపై పోలీసులు అమానుషంగా వ్యవహరించి నిర్బంధం ప్రయోగించడం తీవ్రంగా ఖండనీయం. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పిడిగుద్దులు గుద్ది, బలవంతంగా అదుపులోకి తీసుకుని నగరంలోని పలు పోలీస్ స్టేషన్లకు తరలించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న చర్యగా ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర కమిటీ పేర్కొంది.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు స్మరణ కుమ్మరి రాజ్ కుమార్ మాట్లాడుతూ.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కనీసం 15% నిధులైనా విద్యారంగానికి కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో “ఛలో అసెంబ్లీ” కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంపై చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. విద్యార్థులు లేవనెత్తిన డిమాండ్లుపూర్తిగా న్యాయసమ్మతమైనవని, వాటిని పరిష్కరించాల్సింది పోయి ఉద్యమాలపై అణచివేత విధానం అవలంబించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమనిఅన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 8500 కోట్ల స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి కనీసం 20 శాతం కేటాయింపు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏకపక్షంగా ఎం ఈ పి2020 అమలు చేస్తామని ప్రకటించడాన్ని ఖండిస్తూ, రాష్ట్ర యూనివర్శిటీల లో ఎన్ ఈ పి 2020 అమలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్శిటీలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నాన్‌టీచింగ్ సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల కోసం అమలు చేస్తున్న “బెస్ట్ అవైలబుల్ స్కీం” కింద ఉన్న రూ. 218 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే రాష్ట్రంలో జాతీయ విద్యావిధానం2020 అమలు కాకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఖమ్మం మరియు ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలుగా జనరల్ యూనివర్శిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులపై దాడులు చేసి ఉద్యమాలను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే, రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామనిఎస్ఎఫ్ఐ హెచ్చరించింది. అరెస్టయిన వారిలో ఎస్ఎఫ్ఐజిల్లా అధ్యక్ష కార్యదర్శులు. బొడ్డు స్మరణ్ కుమ్మరి రాజ్ కుమార్.. రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలి

**•బిఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి బానోత్ నెహ్రూ నాయక్**



**కొత్తగూడ మార్చి 25 (వుదయం ప్రతినిధి ):** మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేసి మొక్క రైతుకు మద్దతు ధర కల్పించాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి భానోత్ నెహ్రూ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడ మండలంలో మొక్కజొన్న కొనుగోలు కోసం ఇప్పటివరకు మార్క్ ఫెడ్ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం వలన మద్దతు ధర రాక మొక్కజొన్న రైతులు భారీగా నష్టపోతున్నారని అన్నారు.మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు లేక ఒక క్వింటా కు వ్యాపారులు 1600 నుంచి 1800 వరకు కొనుగోలు చేయడం వల్ల రైతులు భారీగా నష్టపోతున్నారని ఇప్పటికైనా ఈ ప్రాంత ఎమ్మెల్యే మంత్రి సీతక్క స్పందించి అధికారులతో మాట్లాడి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కొత్తగూడ లో ఏర్పాటు చేసి మొక్కజొన్న రైతులకు అండగా ఉండాలని లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తామని కొత్తగూడ మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి బానోత్ నెహ్రూ నాయక్ డిమాండ్ చేసారు.

# పాలిటెక్నిక్ కళాశాల 'ప్లాటినం జూబ్లీ' వేడుకలు




**వరంగల్ టౌన్, మార్చి 25 (వుదయం ప్రతినిధి) :** వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 70 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, ఈ నెల 29న ఘనంగా 'ప్లాటినం జూబ్లీ' వేడుకలను నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఇ.వి. శ్రీనివాస్ రావు తెలిపారు. బుధవారం రోజున కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. 1955 నుండి నేటి వరకు చదివిన పూర్వ విద్యార్థులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ సమ్మేళన ఉద్దేశం.

కళాశాల పాత భవనం స్థానంలో నూతన భవనం వస్తున్న నేపథ్యంలో, పాత జ్ఞాపకాలను, తరగతి గదులను మరోసారి స్మరించుకునేందుకు ఇది గొప్ప అవకాశం. దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఈ వేడుకకు హాజరవుతారని, ఇది భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ మహోత్సవానికి పూర్వవిద్యార్థులందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్ కుమార్, కోశాధికారి ఆనంద్ కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ నిధులతో రోడ్డుపనులు ప్రారంభం

**తిరుపతిరెడ్డి సర్పంచ్ లలిత రఘు**



**నల్లబెల్లి, మార్చి 25(వుదయం):** మండల పరిధిలోని నాగరాజుపల్లి గ్రామపంచాయతీలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవతో, ఉపాధి హామీ పథకం ఈజీఎస్ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల తిరుపతిరెడ్డి, గ్రామ సర్పంచ్ ఎరుకల లలిత రఘు ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గ్రామాల అభివృద్ధియే ధ్యేయంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే ఈ నిధుల మంజూరు జరిగిందని పేర్కొన్నారు. నాణ్యతతో పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టరును కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వైనాల అశోక్, ఇస్తారు శేఖర్ గౌడ్, భూక్య భౌసింగ్, పబ్బు రాజేష్, బైరి వెంకటేశ్వర్లు, వల్లే పైడి, బైరి అశోక్ లతో పాటు స్థానిక వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెలుగుల బాటలో మూడుచెక్కలపల్లె

**ఇంటింటికీ ఉచిత విద్యుత్ మీటర్లు**



**నల్లబెల్లి, మార్చి 25(వుదయం):** మండల పరిధిలోని మూడుచెక్కలపల్లె గ్రామం అభివృద్ధిలో ముందడుగు వేస్తోంది. గ్రామంలో విద్యుత్ సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో నూతనంగా విద్యుత్ స్తంభాల (కరెంట్ పోల్స్) ఏర్పాటుతో పాటు, ప్రతి ఇంటికి ఉచిత విద్యుత్ మీటర్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సపావట్ కవిత దేవు నాయక్ స్వయంగా ప్రారంభించి, లబ్ధిదారులకు మీటర్లను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. గ్రామస్తులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.పాత స్తంభాల స్థానంలో నూతన పోళ్లను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ అంతరాయం కలగకుండా చూస్తున్నామని, ప్రతి ఇంటికీ సక్రమంగా వెలుగులు నింపేందుకు ఈ ఉచిత మీటర్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ సదుపాయాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు బొమ్మిడి శివారెడ్డి, పబ్బోజు నరసింహ చారి,ప్రజా ప్రతినిధులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే దొంతి కుమారుని పుట్టినరోజు వేడుకలు.

**నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి**



**ఖానాపురం, మార్చి 25 (వుదయం ప్రతినిధి):** మండల కేంద్రంలోని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు ఇంటి వద్ద నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కుమారుడు దొంతి అవియుక్త్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యద్ల జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డివిజన్ అధ్యక్షుడు యద్ల బిక్షంరెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కే ముస్తాఫా, వార్డు సభ్యులు వేములపల్లి వెంకటప్రసాదరావు, చలిగంటి మల్లికార్జున్, నాయకులు కందుల సాంబయ్య, దేవినేని వేణుగోపాల్ రావు, భీమగాని సురేష్, జటంగి నాగరాజు, మూడు కిషన్, దేవినేని వెంకటేశ్వర్ రావు, బుచ్చయ్య, శంకర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ కొరత లేదు వదంతులను నమ్మవద్దు



**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 25 (వుదయం జిల్లా ప్రతినిధి):** జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వదంతుల కారణంగా ప్రజలు ఆందోళనకు గురవుతూ, ఒకేసారి పెద్ద సంఖ్యలో పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనాల్లో ఫుల్ ట్యాంక్ నింపించుకోవడం వల్ల అనవసర రద్దీ, అంతరాయం ఏర్పడుతున్నదని తెలిపారు.జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా కూడా నిరంతరంగా కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ఎటువంటి కొరత పరిస్థితి లేదని, ప్రజలు అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవద్దని సూచించారు. అలా చేయడం వల్ల ఇతరులకు అసౌకర్యం కలుగుతుందని తెలిపారు.సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మకూడదని,

నిర్ధారించని సమాచారాన్ని షేర్ చేయడం ద్వారా గందరగోళం సృష్టించవద్దని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.జిల్లాలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని, వదంతులు వ్యాప్తి చేయడం లేదా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలు చేపడితే, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బాలుర పాఠశాలలో సలాడ్ మేకింగ్



**జయశంకర్ భూపాలపల్లి, మార్చి 25 (వుదయం జిల్లా ప్రతినిధి):**

మహాదేవపూర్ మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో బుధవారం జాతీయ పర్యావరణ విద్య లో భాగంగా సలాడ్ మేకింగ్ మిల్లెట్ ఫుడ్స్ వర్క్ షాప్ నిర్వహించారు. దీనిలో భాగంగా జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మహాదేవపూర్ ఎన్ జీ సీ ఇంచార్జి ఉపాధ్యాయుడు ప్రభాకర్ రెడ్డి మరియు తిరుపతి రెడ్డి లు విద్యార్థులకు గ్రీన్ సలాడ్స్, ఫ్రూట్ సలాడ్స్ మరియు చిరుధాన్యాల పట్ల అవగాహన కల్పించారు. పచ్చి కూరగాయలు తినడం వల్ల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందని, పండ్లు తినడం వల్ల రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా తయారు అవుతుందని,మిల్లెట్స్ లో విపరీతంగా విటమిన్స్ ఉంటాయని విద్యార్థులందరు కనీసం రోజుకు ఒక పూట ఆహారం తీసుకుంటే పర్యావరణానికి మేలు జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు అనిల్ కుమార్ ఉపాధ్యాయులు రాజయ్య, రమేష్, లచ్చయ్య,అనిల్ కుమార్, సమ్మయ్య, షాజహా బేగం, కవిత,కిరణ్ కుమార్,కోటేష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తోపాటు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సలాడ్స్ విద్యార్థులందరు ఆనందంగా స్వీకరించారు

# కౌన్సిలర్ పూర్ణ చారి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు




**పరకాల మార్చి 25 (వుదయం ప్రతినిధి):**

పరకాల పట్టణ తొమ్మిదో వార్డ్ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి ఆధ్వర్యంలో వేసవి కాలంలో ప్రజలకి దాహార్తిని తీర్చే సదుద్దేశంతో చలివేంద్రమును తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పరకాల పట్టణంలోని కూరగాయల మార్కెట్ గల్లి లో గత కొన్ని సంవత్సరాల నుండి వేసవి కాలం లో పరకాల మరియు పరిసర గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చే సదుద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేసేవాళ్ళం. ఈ సంవత్సరం నేటి నుండి వేసవికాలం పూర్తయ్యే వరకు కూల్ వాటర్ క్యాన్లతో సొంత ఖర్చులతో చలివేంద్రం ద్వారా చల్లటి నీటిని ప్రజలకు అందిస్తానని తెలిపారు. పరకాల ప్రజల ఆదరాభిమానాలతో ఆ భగవంతుని కృపతో ప్రజల సౌకర్యార్థం ప్రజల కోసం ప్రజా ఉపయోగ పనులను చేయడానికి సిద్ధంగా ఉన్నానని నా మీద నమ్మకముతో 9వ వార్డు ప్రజలు నన్ను నమ్మి మళ్ళీ కౌన్సిలర్గా గెలిపించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# కుంజ రామన్న వర్ధంతి సభను జయప్రదం చేయండి



**"తుడుం దెబ్బ" పిలుపు**

**కొత్తగూడ మార్చి 25 (వుదయం ప్రతినిధి ):** మార్చి 27 న ఆదివాసీ లిబరేషన్ టైగర్ వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ కుంజ రాము 22వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ)జిల్లా అధ్యక్షులు సువర్ణపాక వెంకట రత్నం పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు అభివృద్ధి చెందాలంటే స్వయం పాలన ఉద్యమాలు అవసరం అని త్రికరణ శుద్ధిగా నమ్మిన ఉద్యమ నాయకుడు కామ్రేడ్ కుంజ రాము అని అన్నారు.నిరుపేద ఆదివాసీ కోయ తెగలో పుట్టిన కుంజ రాము ఆదివాసీల పైనా జరుగుతున్న అన్యాయలపై పదిహేను సంవత్సరాల వయసులోనే ఉద్యమ బాట పట్టాడని 35 ఏళ్ల పాటు అజ్ఞాత ఉద్యమ జీవితంలో ప్రజాస్వామ్య సామాజిక మార్పు కోసం ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అనేక ఉద్యమాల రూప కల్పనలో వ్యవహరించారనీ అన్నారు. తుడుం దెబ్బ, మాదిగ దండోరా,డోలు దెబ్బ, మెకు దెబ్బ,పూసల కేక వంటి అనేక కుల ఉద్యమాలను సంఘీడిత పరిచారని ఆదివాసీల స్వయం పాలన కోసం గేరిల్లా తరహా పోరాటామె శరణ్యం అని భావించిన కామ్రేడ్ కుంజ రాము సెప్టెంబర్ 30.2004 న ఆదివాసీ లిబరేషన్ టైగర్స్ అనే సంస్థను స్థాపించాడనీ అన్నారు. ఆనాటి వరంగల్ఖమ్మం జిల్లాల సరిహద్దు కంబాల్ల పల్లిగోరిమిళ్ల అడవుల్లో ఏరమ్మ గుట్టలో పోలీసులకు కుంజ రాము సైన్యానికి జరిగిన పోరాటం లో వీరమరణం పొందారని అన్నారు.ఆదివాసీల జీవితాలు పోరాటల తోనే ముడిపడి ఉన్నాయని ఆదివాసీల కోసం అమరులైన వీరులను స్మరించుకోవాలని ఆదివాసీ ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. మార్చి 27 న జరిగే కామ్రేడ్ కుంజ రామన్న 22 వ వర్ధంతి కి ఉమ్మడి కొత్తగూడ మండలంలో ఉన్న ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని ఘన నివాళులర్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ కొత్తగూడగంగారం మండలాల అధ్యక్షులు పూనెం సందీప్,పెనక వెంకన్న, తుడుం దెబ్బ నాయకులు ఇర్ప రవి పాల్గొన్నారు.

# ఎస్సీ కాలనీలో పారిశుధ్యంపై కమిషనర్‌కు ఫిర్యాదు



**మధిర మార్చి 26,వుదయం ప్రతినిధి):**

మధిర పట్టణంలోని ఎస్సీ కాలనీలో గత కొంతకాలంగా నెలకొన్న పారిశుధ్యంపై సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ యువత గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కాలనీలో కోతుల బెడద, వీధి కుక్కల స్వైరవిహారం మరియు పారిశుధ్య లోపంపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.కాలనీలో కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని,ఇళ్లలోకి చొరబడి సామాగ్రిని నాశనం చేయడమే కాకుండా, చిన్న పిల్లలు ,వృద్ధులపై దాడులకు తెగబడుతున్నాయని యువత పేర్కొన్నారు.తక్షణమే కోతులను పట్టుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.కాలనీలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా వైరస్ సోకినట్లు కనిపిస్తున్న కొన్ని కుక్కల వల్ల ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని,వాటిని నియంత్రించాలని డిమాండ్ చేశారు.కాలనీలోని డ్రైనేజీ కాలువలు పూడిక పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయని, దోమల వ్యాప్తి పెరిగిందని వారు ఫిర్యాదు చేశారు కాలువలను వెంటనే శుభ్రం చేయించాలని కోరారు.చెత్త సేకరణ వాహనాలు క్రమబద్ధంగా రావడం లేదని,దీనివల్ల వీధుల్లో చెత్త పేరుకుపోతోందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.ప్రతిరోజూ చెత్తను సేకరించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మేడుగు బాబు,గద్దల చిరు,గద్దల వెంకటేశ్వర్లు, గద్దల స్వామి,పార్వతి ఎసుక,పాపట్ల రమేష్,పాల్గొన్నారు.

# ఉక్కపోతకు గురవుతున్న అంగన్ వాడి చిన్నారులు

**అంగన్‌వాడీ చిన్నారులకు ఒంటిపూట బడులు పెట్టాలి.**
**మద్దాల ప్రభాకరరావు సీపీఐఎం జిల్లా నాయకులు.**



**మధిర మార్చి 26,వుదయం ప్రతినిధి):**

ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాల్లో ఒంటిపూట బదులు ప్రభుత్వం నిర్వహిస్తుంది. కాని అంగన్ వాడి కేంద్రాల్లో ఉండే అసలే చిన్న పిల్లలు వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్నాయి ఎండ తీవ్రత ఉక్కపోత తో అద్దె భవనాల్లో చిన్నచిన్న అంగన్వాడి కేంద్రాలలో ఉండే చిన్న గదుల్లో ఆడుకోకోడం, పడుకోవడం చిన్నారులు మరింత అవస్థ పడుతూ సాయంత్రం నాలుగు గంటల వరకు వేడికి తట్టుకోలేక చిన్నారులు అంగన్ వాడి కేంద్రాలలో ఉండలేకపోతున్నారు. ఆ సమయంలో కనీసం ఆ కేంద్రాల్లో చల్లని తాగనీరు కూడా లేకపోవడంతో వేడి నీళ్లు తాగలేక దాహార్తికి చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని ప్రతి ఒక్క అంగన్వాడి కేంద్రానికి వాటర్ ఫిల్టర్ ఏర్పాటు, మౌలిక సదుపాయాలు కల్పించాలని. ఎండ ప్రభావం అధిక ఉష్ణోగ్రత తీవ్రత అధికంగా ఉండడంతో పిల్లలు ఉక్కపోతకు గురవుతున్నారని. కావున చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ,ఉన్నత అధికారులు ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో కూడా ఒంటిపూట బడి విధానం వెంటనే అమలు చేయాలని సిపిఐఎం జిల్లా నాయకులు మద్దాల ప్రభాకరరావు డిమాండ్ చేశారు.

# ధర్మభిక్షం సేవలు ప్రజలకు ఆదర్శం



**నల్గొండమార్చి 26, వుదయం ప్రతినిధి):**

ప్రజల హక్కుల కోసం జీవితాంతం నిరంతరం పోరాటాలు సాగించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, అమరజీవి బొమ్మగాని ధర్మభిక్షం అందరికీ ఆదర్శప్రాయుడని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్ తెలిపారు.ధర్మభిక్షం 15వ వర్ధంతి సందర్భంగా నల్గొండలోని సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిజాం పాలనలో జరిగిన అణచివేతకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ధర్మభిక్షం కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.గ్రామీణ ప్రజలపై జరుగుతున్న అన్యాయాలకు ఎదురు నిలిచి, భూమి మరియు జీవనోపాధి హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో కరువు, ఫ్లోరైడ్ సమస్యలపై ప్రజల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వాలను కదిలించారని తెలిపారు.ప్రజా సమస్యలపై ఎలాంటి రాజీ పడని ధోరణి, సామాజిక న్యాయం కోసం నిరంతర పోరాటం ధర్మభిక్షాన్ని అన్నారు.గీత పనివారాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పబ్బు వీరస్వామి మాట్లాడుతూ గీత వృత్తిదారుల హక్కుల కోసం ధర్మభిక్షం చేసిన కృషి ఫలితంగానే నేడు పలు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఆ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని తెలిపారు. అదేవిధంగా ధర్మభిక్షం పేరును సూర్యాపేట జిల్లాకు పెట్టాలని, ఆయన జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దీటి నరసయ్య, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి యాదయ్య, సిపిఐ నాయకులు వి. లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా పూర్తి అమలు చేయాలి : బీజేపీ కిసాన్ మోర్చా

**నల్గొండ,మార్చి**
**వుదయం జిల్లా ప్రతినిధి :**

రైతు సమస్యల పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ నల్గొండ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు గడ్డం వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని, ముఖ్యంగా రైతు భరోసా నిధులు ఆలస్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.రైతు భరోసా పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే వరి కోతల నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏప్రిల్ నెలలోనే సెంటర్లు ప్రారంభించాలని సూచించారు. అలాగే రైతులకు ఇవ్వాల్సిన బోనస్ మొత్తాలను ఆలస్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలని కోరారు.ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని, పథకాన్ని గ్రామీణ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వా లక్ష్మీ నర్సయ్య పాల్గొని రైతుల సమస్యలపై మాట్లాడారు. రైతులకు మద్దతుగా పార్టీ ఎల్లప్పుడూ నిలుస్తుందని తెలిపారు.అదేవిధంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, సెంట్రల్ హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ వీరెల్లి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదగోని శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర భూ నిర్వాసితుల సెల్ కన్వీనర్ భవనం మధుసూదన్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి కన్మత రెడ్డి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, మహిళా మోర్చా నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# అంబేద్కర్ జయంతి కవాతుకు ఐక్యంగా రావాలి



**నల్గొండ,మార్చి**
**వుదయం జిల్లా ప్రతినిధి :**

బ్లూ, బ్లాక్, గ్రీన్ షర్ట్స్ కవాతును విజయవంతం చేయాలని రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా. పిడమర్తి రవి పిలుపునిచ్చారు. నల్గొండ టౌన్ క్లాక్ టవర్ సెంటర్‌లోని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి కార్యాలయంలో కవాతుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 14న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని దళిత, బహుజన, మైనారిటీ, గిరిజనులు ఐక్యంగా ఈ కవాతులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కవాతు ఎల్బీ స్టేడియంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ప్రారంభమై, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం వరకు కొనసాగుతుందని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలాలు, పెన్షన్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. అలాగే ఎస్సీ రిజర్వేషన్లను 20 శాతానికి పెంచి అందులో మాదిగలకు 12 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా బీసీలకు 42 శాతం, ఎస్టీలకు 12 శాతం, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర నాయకులు కురుపాటి సుదర్శన్, మాతంగి అమర్, కత్తుల వంశీ, మాదిగ జేఏసీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క మహేష్, కట్టెల శివ, విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బహుజన దమ్మపేట మండల పాస్టర్స్ నూతన కమిటీ ఎన్నిక



**మండల పాస్టర్ల ప్రెసిడెంట్ గా సెబెస్టియన్**
**దమ్మపేట మార్చి 26 (వుదయం ప్రతినిధి ):**

బహుజన దమ్మపేట మండల పాస్టర్స్ కమిటీ ఆధ్వర్యంలో దమ్మపేట మండలం గురువాయిగూడెం గ్రామం తామ జోసెఫ్ పాస్టర్ అగపే ఫిలిదెల్ఫియా ప్రార్ధన మందిరంలో మడివి ఇశ్రాయేలు అధ్యక్షతన దమ్మపేట పాస్టర్స్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో బహుజన దమ్మపేట మండల నూతన కమిటీ ఏర్పాటుకు గల కారణాలు దైవ ప్రసాద్ , నిరీక్షణరావు వివరణ తెలియచేసి, ఈ కమిటీ యొక్క విధి విధానాలను భవిష్యత్ ప్రణాళికను గూర్చి సమావేశానికి హాజరైన పాస్టర్స్ కి దిశా నిర్దేశం తెలియజేయడం జరిగింది. ఎలికే యేసు పాదం , బండారు జాను ఈ కమిటీ గురించి పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. దమ్మపేట మండల పరిధిలో నీ దైవ సేవకుల అభిప్రాయ సేకరణతో, పాస్టర్స్ సహవాసం మరియు సంక్షేమం,బలోపేతం కోరకు బహుజన దమ్మపేట మండల పాస్టర్స్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ...ప్రెసిడెంట్ గా సెబాస్టియన్ , వైస్ ప్రెసిడెంట్ కొమరం యేసు రత్నం , సెక్రెటరీ కే క్రాంతి కుమార్ , జాయింట్ సెక్రెటరీ యం. జెకర్యా, ట్రెజరర్ లారెన్స్ , గౌరవ అధ్యక్షులుగా ఎలికే యేసుపాదం , కె. దైవ ప్రసాద్ , గౌరవ సలహాదారులు రవిబాబు , కార్య నిర్వహక సభ్యులుగా కొండ్రు శ్యాంబాబు , ఈసం తిమోతి , సోయం అర్జున్ , సోషల్ మీడియా సభ్యులుగా కాక రమేష్ జాషువా , కోర్స తిమోతి ఎన్నిక చేయడం జరిగింది .ఈ సమావేశంలో బహుజన దమ్మపేట కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన సెబాస్టియన్ మాట్లాడుతూ ఎన్నిక దైవ చిత్తమని నాకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని అందరి సహాయ సహకారాలతో ఈ కమిటీనీ బలోపేతం చేయడానికి నా వంతుగా కృషి చేస్తానని తెలియజేశారు. వైస్ ప్రెసిడెంట్ కొమరం యేసు రత్నం మాట్లాడుతూ మండలంలో ఉన్న సేవకులందరూ ఈ కమిటీలో భాగస్వాములు కావాలని పిలుపు ఇవ్వడం జరిగింది, సేవకులందరం ఐక్యతతో ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలియజేశారు.

సెక్రటరీ క్రాంతి కుమార్ మాట్లాడుతూ కమిటీ సెక్రటరీగా నాకు ఇచ్చిన ఈ బాధ్యతను అందరి సహాయ సహకారాలతో ఫెలోషిప్ బలోపేతానికి నా వంతుగా కృషి చేస్తానని,అందరం కలిసి ముందుకు కొనసాగుదామని తెలిపారు. ట్రెజరర్ లారెన్స్ మాట్లాడుతూ నూతన కమిటీ నూతన ఉత్తేజంతో, ఉత్సాహంతో కమిటీ బలోపేతానికి అందరూ సహకారం అందించాలని కోరడం జరిగింది. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఘనంగా శాలువాతో, పూలమాలతో సత్కరించి సన్మానం చేయడం జరిగింది.ఈ సమావేశములో సుమారు 60 (అరవై) మంది మండల పాస్టర్స్ పాల్గొన్నారు.

# సూర్యాపేట లో వెయ్యి సంవత్సరాల జ్యోతిర్లింగ దర్శనం

**- పెద్ద ఎత్తున దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు**
**- సూర్యాపేట మార్చి 26(వుదయం):**




వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన సోమనాథ్ మూల విరాట్ జ్యోతిర్లింగ దివ్య దర్శనం ను సూర్యాపేట పట్టణ భక్తులు దర్శించుకున్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రవి మహల్లో సూర్యాపేట ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోమనాథ్ మూల విరాట్ జ్యోతిర్లింగాన్ని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.భారతదేశంలోని జ్యోతిర్లింగాల్లో మొదటిదైన వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన సోమనాథ్ జ్యోతిర్లింగ ఆలయాన్ని గజని మహ్మద్ ధ్వంసం చేసిన తరువాత అందులోని మూల విరాట్ జ్యోతిర్లింగాన్ని అగ్ని హోత్రి బ్రాహ్మణులు గోప్యంగా దాచి నేటి వరకు పూజలు నిర్వహిస్తున్నారు. వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన సోమనాథ్ మూల విరాట్ జ్యోతిర్లింగం నేటి వరకు మన కళ్ళకు అందనిది. జ్యోతిర్లింగాలను సూర్యాపేట పట్టణ ప్రజలకు బ్రహ్మర్షి రిషి దేవ వ్రత్ జి, సూర్యాపేట ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆ అదృష్టాన్ని కలిగించారు .ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మాజీ మున్సిపల్ చైర్మెన్ జుట్టుకొండ సత్య నారాయణ,చలమల్ల నరసింహ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు వంగవీటి రమేష్, బుద్ధ బిక్షపతి, సందీప్ బాణాల శ్రీనివాస్, రాధాకృష్ణ, నరేందర్ భరద్వాజ్ ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గీతా కార్మికుల ఆశాజ్యోతి బొమ్మగాని ధర్మబిక్షం

**- బోలగాని సత్యనారాయణ**
**యాదాద్రి భువనగిరి ,మార్చి**
**వుదయం జిల్లా ప్రతినిధి :**



తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ పార్లమెంట్ సభ్యులు కీ.శే. బొమ్మగాని ధర్మబిక్షం గీతా కార్మికుల ఆశాజ్యోతి అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ అన్నారు. కీ.శే. బొమ్మగాని ధర్మబిక్షం 15వ వర్ధంతి వేడుకలు మోటకొండూరు మండల కేంద్రంలో సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ, మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం హాజరై, ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బోలగాని సత్యనారాయణ మాట్లాడుతూ.. ధర్మబిక్షం కేవలం ఒక నాయకుడే కాదని, గీతా కార్మికుల పాలిట ఆరాధ్య దైవమని కొనియాడారు. గీత వృత్తిపై ఆధారపడిన వారి సమస్యల కోసం పార్లమెంటులోనూ, అసెంబ్లీ లోనూ గళం విప్పిన గొప్ప వ్యక్తి అని, మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపీగా ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు ఆయన అందించిన సేవలు మరువలేనివి అని గుర్తు చేశారు. సాయుధ పోరాట కాలంలో దున్నేవాడిదే భూమి.. గీసేవాడిదే చెట్టు అనే నినాదంతో ఆయన చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. మద్య పాన నిషేధం నుండి కల్లును మినహాయించాలని, గీత కార్మికులకు చెట్ల పెంపకం కోసం 10 ఎకరాల భూమి కేటాయించాలని ఆయన నిరంతరం పోరాడారని తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు బీరకాయల మల్లేష్, గ్రామ శాఖ సహాయ కార్యదర్శి జివిలికపల్లి పాండు, ఏఐవైఎఫ్ అధ్యక్షులు బీరకాయల మధు, మరియు నాయకులు ఎండి వంశీ, ఎర్ర కృష్ణయ్య, బీరకాయల పోశయ్య, మొగిలిపాక యాదయ్య, తంబాల మధు, బీరకాయల రాములు, వడ్డబోయిన అచ్చయ్య, బిక్షపతి, బీరకాయల మైసయ్య, సిద్దయ్య పాల్గొన్నారు.

# ఇండస్ట్రి ఇంటర్న్ షిప్ పై అవగాహన సదస్సు




**మధిర మార్చి 26, వుదయం ప్రతినిధి):**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మధిరలో ప్రిన్సిపల్ అధ్యక్షతన ఇండస్ట్రీ ఇంటర్న్ షిప్ పై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ యొక్క ప్రాముఖ్యత,అవసరం,మరియు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో కేవలం పాఠ్యపుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా ప్రాక్టికల్ అనుభవం కూడా ఎంతో అవసరమని తెలిపారు.ఇంటర్న్ షిప్ ద్వారా విద్యార్థులు పరిశ్రమలలో పని చేసే విధానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకొని, తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి. అరుణ,అధ్యాపకులు డా.ఎస్ ఇందిర,డా.పి.సుజాత,డా.వి.నాగరాజు,డా.కే.రామకృష్ణ,పి.లక్ష్మీ నారాయణ,షేక్.ఇమ్రాన్ ,కే .వెంకటేష్, పి.శ్రీనివాస్,పి.మాధురి,ఎస్ జ్యోతి,ఎం.హారిక అధ్యాపకేతర సిబ్బందివిద్యార్థులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గొంది మురళి మోహన్ విజయం



**దమ్మపేట మార్చి 26**
**(వుదయం ప్రతినిధి):**

దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జి కం ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం ఉత్సాహభరితంగా జరిగాయి. అత్యంత ఉత్కంఠగా సాగిన అధ్యక్ష పదవి పోరులో గొంది మురళి మోహన్ ఘన విజయం సాధించారు. అసోసియేషన్ పరిధిలోని మొత్తం 13 ఓట్లకు గాను 12 ఓట్లు పోల్ అవ్వగా, మెజారిటీ సభ్యులు ము ర ళి మోహన్ వైపు మొగ్గు చూ పా రు . అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించగా, మిగిలిన కీలక బాధ్యతలకు సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.ఉపాధ్యక్షుడిగా ముప్పుడి శ్యామ్ సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా లక్కినేని నరేంద్ర బాబు, కోశాధికారిగా తమ బాల రాజు, కార్యదర్శిగా తుమ్మ రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు క్రీడల కార్యదర్శిగా తిర్నాటి సంజయ్, మహిళా ప్రతినిధిగా తనగాల అరుణ కుమారి, ఈసీ1 సభ్యుడిగా దార మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నల్లపు ఉదయ్ కుమార్ ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని మరియు కార్యవర్గ సభ్యులను స్థానిక న్యాయవాదులు ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. బార్ అసోసియేషన్ బలోపేతానికి, న్యాయవాదుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గొంది మురళీమోహన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, షేక్ దర్గావలి, నల్లపు ఉదయ్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు

# అసోసియేషన్ ఎన్నికల్లో చావలి రామరాజు ఘనవిజయం



**మధిర మార్చి 26,**
**వుదయం ప్రతి- నిధి):**

మధిర బార్ అసోసియేషన్ ఎన్నికల్లో చావలి రామరాజు ప్యానల్ ఘనవిజయం సాధించింది.ఆయన ప్యానెల్ లో పోటీ చేసిన అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూడు ప్రధాన పదవులు చావలి రామరాజు ప్యానెల్ కైవసం.మధిర బార్ అసోసియేషన్ ఎన్నికల్లో మొత్తం 39 ఓట్లు పోల్ కాగా, అధ్యక్షులుగా పోటీ చేసిన చావలి రామరాజుకి 24 ఓట్లు కావూరి రమేష్ కి 15 ఓట్లు వచ్చాయి. తొమ్మిది ఓట్ల మెజార్టీతో రామరాజు అధ్యక్షులుగా గెలుపొందారు.ప్రధాన కార్యదర్శిగా పోటీచేసిన కోట జ్ఞానేశ్ కి 25 ఓట్లు రాగా ఆయన ప్రత్యర్థి పల్లపోతు కృష్ణ రావుకి 14 ఓట్లు వచ్చాయి.
11 ఓట్ల మెజార్టీతో కోట జ్ఞానేష్ ప్రధాన కార్యదర్శిగా గెలుపొందారు.
ఉపాధ్యక్షులుగా పోటీ చేసిన సునీతకి 22 ఓట్లు రాగా ఆమె ప్రత్యర్థి భైరవభట్ల వెంకటరమణ కి 17 ఓట్లు వచ్చాయి దీంతో ఆమె ఐదు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

# సొంతింటి కలకు ప్రభుత్వ అర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

# జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి**
**ప్రతి మండలంలో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి**
**అధికారులు నిర్మాణాల పురోగతిని నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి**
**తిరుమలాయపాలెం మండలం ఇస్లావత్ తండా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



ఖమ్మం, వుదయం బ్యూరో మార్చి 26:
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అందిస్తున్న ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.గురువారం పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. ఇస్లావత్ తండా గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. లబ్ధి దా రు ల తో నిర్మాణంలో ఉన్న ఇండ్ల ప్రస్తుత పరిస్థితుల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తిరుగుతూ నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల దశలను ప్రత్యక్షంగా పరిశీలించి, లబ్దిదారులకు ఇళ్లు త్వరితగతిన పూర్తయ్యేలా పనులను వేగవంతం చేసేలా అధికారులు సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలంలో మొత్తం 802 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 736 ఇండ్ల నిర్మాణాలు వివిధ దశలలో, కొన్ని గృహ ప్రవేశాలకు సిద్ధంగా, రూఫ్ స్థాయి, లేంటల్ స్థాయి, బేస్మెంట్ స్థాయిలలో ఉన్నాయని తెలిపారు.
పునాది పూర్తయిన తర్వాత, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత, స్లాబ్ దశలో, నిర్మాణం పూర్తిగా పూర్తయిన తర్వాత మొత్తంగా ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వ అర్థిక సాయం లబ్ధిదారుల ఖాతాలో జమచేస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. అర్హులై పునాది స్థాయి వరకు కట్టుకోలేని వారికి మహిళా సంఘాల ద్వారా రుణం ఇప్పించుటకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ అన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు కొనసాగించేందుకు సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పనులు ఆలస్యం కాకుండా నిర్దేశిత గడువులో పూర్తి చేసి లబ్ధిదారులకు గృహాలను ప్రారంభోత్సవం కు సిద్ధం చేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని, ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులు నిర్వహించుకోవాలని, దశలకు అనుగుణంగా బిల్లు వస్తున్నాయి .
కాబట్టి నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా వేగవంతంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు కలెక్టర్ సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తే ప్రభుత్వ నిధులు కూడా త్వరగా విడుదల అవుతాయని, అందువల్ల లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అధికారులు కూడా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సహకారం అందించాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి లబ్ధిదారు సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలని తెలిపారు.
అధికారులు ఇండ్ల పురోగతిని నిరంతర పర్యవేక్షణ చేయాలని, లబ్ధిదారులకు ప్రతి దశలో ప్రభుత్వం నుండి సహకారం అందించాలని, తక్కువ ధరలో నాణ్యమైన నిర్మాణం చేపట్టేలా సలహాలు, సహకారం అందించాలని అన్నారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమని, అధికారులు వ్యక్తిగత శ్రద్ధతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు.
ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ లూథర్ విల్సన్, ఎంపిడివో సిలార్ సాహెబ్, హౌజింగ్ డిఇ జగ్రాం, ఏఇ నవ్య, పంచాయతీ కార్యదర్శి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## చమురు 150 డాలర్లకు చేరితే.. మాంద్యంలోకి ప్రపంచం..!



చమురు ధరలు 150 డాలర్లకు చేరితే ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి వెళ్తుందని అమెరికా అసెట్ మేనేజ్‌మెంట్ దిగ్గజం బ్లాక్‌రాక్ సీఈవో లారీ ఫింక్ హెచ్చరించారు. ఇరాన్ ముప్పు కొనసాగి.. చమురు ధరలు పెరిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు అంతర్జాతీయ డియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. పశ్చిమాసియాలో ప్రస్తుత ఘర్షణలు చివరకు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయనే దానిపై ఇప్పుడే ఒక అంచనాకు రావడం తొందరపాటే అవుతుందని ఫింక్ అన్నారు. "ఘర్షణలు ముగిసి, ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇరాన్‌ను ప్రపంచం ఆమోదిస్తే.. చమురు ధరలు యుద్ధం ముందు నాటికంటే దిగువకు పడిపోతాయి. అలాకాకుండా వార్ కొనసాగి, ఆ ధరలు 100డాలర్లకు పైగా.. 150డాలర్లకు చేరువగా సుదీర్ఘకాలంఉంటే ప్రపంచ ఆర్థికవ్యవస్థపై పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి.




## ఫిలిప్స్ వన్ చెఫ్ విడుదల

భారతీయ గృహాలకు పాకశాస్త్ర అవకాశాల ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ, రోజువారీ వంటను సులభతరం చేయడానికి రూపొందించిన వినూ



త్నమైన ఆల్-ఇన్-వన్ స్మార్ట్ కుకింగ్ ఉపకరణం అయిన ఫిలిప్స్ వన్ చెఫ్ ను విడుదల చేస్తున్నట్లు ఫిలిప్స్ హోమ్ అప్లయన్సెస్ వెల్లడించింది. ముంబైలో, రణ్ వీర్ బ్రార్ పర్యవేక్షణలో జరిగిన ఒక అనుభవ పూర్వకమైన చెఫ్స్ టేస్టింగ్ టేబుల్ కార్యక్రమంలో ఈ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో అతిథులను లైవ్ టేస్టింగ్స్, ఇంటరాక్టివ్ ఫుడ్ స్టేషన్ల ద్వారా భారతదేశంలోని విభిన్న వంట రుచులను అన్వేషించడానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గుల్బహార్ తౌరానీ మాట్లాడు తూ వెర్సుని వద్ద భారతీయ కుటుంబాలు వాస్తవానికి ఎలా వంట చేస్తాయో అర్థం చేసుకోవడం, వారి రోజువారీ వంటలలో సహజంగా ఇమిడిపోయే ఉపకరణాలను రూపొందించడంపైనే తమ లక్ష్యం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. భారతీయ వంటకాలు చాలా వైవిధ్యమైనవి, తరచుగా ఎక్కువ సమయం తీసుకుంటాయన్నారు. అందుకే రుచిలో రాజీపడకుండా వంట ప్రక్రియలను సులభతరం చేసే పరిష్కారాలు రోజురోజుకూ ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయన్నారు. భారతీయ వంట కాలు ఎంతో వైవిధ్యభరితంగా, విభిన్నంగా ఉంటాయన్నారు. రుచి పరంగా ఎలాంటి రాజీపడకుండా వాటిని మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో సాంకేతికత కీలక పాత్ర పోషించగలదన్నారు.

## ఎసి ధరలకు పశ్చిమాసియా సెగ..!




పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధాల వల్ల ఎసి ధరలు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. సరఫరా తగ్గడం, ముడి సరుకుల ధరలు పెరగడంతో వచ్చే కొద్ది రోజుల్లోనే వినియోగదారులపై భారం పడొచ్చని భావిస్తున్నారు. ప్రముఖ ఎసి ఉత్పత్తుల కంపెనీ బ్లూ స్టార్ నివాస, వాణిజ్య కూలింగ్ విభాగాలలో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకోనున్నట్లు మంగళవారం ప్రకటించింది. హైదరాబాద్‌లో బ్లూస్టార్ వైస్ ప్రెసిడెంట్ మార్కెటింగ్ గిరీష్ హింగోరని, ఆ గ్రూప్ ప్రెసిడెంట్ మోహిత్ సుద్ ఆ కంపెనీ ప్రీమియం శ్రేణీ ఐకోనియా ఉత్పత్తులను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు డియాతో మాట్లాడుతూ.. కంపెనీ పోర్ట్‌ఫోలియోలో ఇప్పుడు 125 రకాల రూమ్ ఎయిర్ కండిషనర్ మోడళ్లు ఉన్నాయన్నారు. ఇందులో వినియోగదారుల అవసరాలకు, వివిధ రకాల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ఫ్లాగ్‌షిప్ ప్రీమియం శ్రేణి ఐకోనియా కూడా ఉందన్నారు. ప్రస్తుతం 1.4 కోట్ల యూనిట్లుగా ఉన్న ఎసి మార్కెట్.. 2030 నాటికి 3 కోట్ల యూనిట్లకు విస్తరిస్తుందని అంచనా వేశారు. ఎసి పరిశ్రమ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ధరలు 7 నుంచి 8 శాతం వరకు పెరగనున్నట్లు గిరీష్, మోహిత్ సుద్ తెలిపారు. ప్రధానంగా రాగి అల్యూమినియం, స్టీల్ వంటి ముడిసరుకుల ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం దాదాపు 8.5 శాతం అధికమైందన్నారు.. దీనికి తోడు కొత్త ఇంధన సామర్థ్య నిబంధనల ప్రకారం తయారీలో మార్పులు చేయాల్సి రావడంతో మరో 4 శాతం అదనపు భారం పడిందన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల ప్లాస్టిక్ విడిభాగాలకు అవసరమైన ఆయిల్, ఎల్ఎన్‌జి లభ్యత తగ్గడం కూడా ఈ సంక్షోభానికి ప్రధాన కారణమన్నారు. ఈ భారాన్ని అప్పుడే వినియోగదారులపై మోపే అవకాశాలు లేవన్నారు.

## భారీ లాభాలతో దూసుకుపోతున్న స్టాక్ మార్కెట్లు




రెండు రోజుల క్రితం వరకు భారీ నష్టాల్లో కొనసాగిన స్టాక్ మార్కెట్లు మంగళవారం నుంచి భారీ లాభాల్లో కొనసాగుతున్నాయి. దీంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ కూడా భారీ లాభాలతో (ప్తబీ ఐవ జూతీనీ*తిబిబ) దూసుకుపోతున్నాయి. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నివారణకు శాంతి చర్చలు జరుగుతున్నాయనే సానుకూల వార్తలతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. దీని ప్రభావంతో సెన్సెక్స్ ఏకంగా 1122 పాయింట్లు లాభపడి 75,190 మార్కును తాకగా, నిఫ్టీ 316 పాయింట్ల వృద్ధితో 23,272 వద్ద ట్రేడ్ అవుతోంది. ప్రధానంగా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎనర్జీ రంగాల షేర్లలో కొనుగోళ్ల జోరు కనిపిస్తుంది. సెన్సెక్స్ టాప్-30 ఇండెక్స్‌లో ట్రెంట్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్ వంటి దిగ్గజ సంస్థల షేర్లు 2 శాతానికి పైగా లాభపడి మార్కెట్ ర్యాలీకి నాయకత్వం వహిస్తున్నాయి. గ్లోబల్ మార్కెట్ల నుంచి అందుతున్న సానుకూల సంకేతాలకు తోడు, దేశీయంగా ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతు తోడవడంతో మార్కెట్లు సరికొత్త ఉత్సాహంతో కనిపిస్తున్నాయి. ఒకవేళ ఇదే సానుకూల ధోరణి కొనసాగితే, రానున్న సెషన్లలో సూచీలు మరిన్ని గరిష్టాలను తాకే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## దేశ జీడీపీ డౌన్!..

### ఈసారి 5.9 శాతానికే పరిమితం

ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండ




బోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది. 2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకుమద్దతిస్తున్నారని పొరుగుదేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లు ప్రయోగిస్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హార్మూజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరి ణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉన్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రాబోయే ద్రవ్య సక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు.

## షాకిచ్చిన బంగారం, వెండి ధరలు

గత వారం రోజులుగా బంగారం ధరలు వరుసగా పతనమవుతూ, కొనుగోలుదారులలో ఆశలు రేకెత్తించాయి. 10 గ్రాముల బంగారం ధర రూ.లక్షకు పడిపోతుందని అందరూ ఎదురుచూస్తున్న తరుణంలో, బుధవారం ఉదయం ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఉదయం 10 గంటలకు హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై ఏకంగా రూ.3760 పెరిగి రూ.1,46,670కి చేరింది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.3450 పెరిగి రూ.1,34,450కి ఎగబాకింది. నేడు బంగారం కొనుగోలు చేసేవారికి ఇది అదనపు భారమనే చెప్పాలి. వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. కిలో వెండిపై రూ.10,000 పెరగ్గా.. నేటి ధర రూ.2,60,000 గా ఉంది. ప్రపంచ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు ఆకస్మికంగా పెరగడం, డాలర్ బలహీనపడటమే దీనికి ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికాలో ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లపై వస్తున్న తాజా వార్తలు పెట్టుబడిదారులను బంగారం వైపు మళ్లించాయి. దీనికి తోడు దేశీయంగా వివాహాల సీజన్ కారణంగా డిమాండ్ పెరగడం, రూపాయి మారకం విలువలో మార్పులు కూడా ఈ పెరుగుదలకు కారణాలుగా కనిపిస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు. బంగారం, వెండి ధరల పెరుగుదల తాత్కాలికమేనా లేక రాబోయే రోజుల్లో కూడా కొనసాగుతుందా అనేది వేచి చూడాలి.



## ఇరాన్ నుంచి 5 మిలియన్ బ్యారెళ్ల చమురు కొన్న రిలయన్స్



ప్రపంచంలోనే అతిపెద్ద రిఫైనరీ కాంప్లెక్స్‌ను నిర్వహిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇరాన్ నుండి సుమారు 50 లక్షల బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేసింది.2019లో అమెరికా ఆంక్షల కారణంగా ఇరాన్ నుండి చమురు దిగుమతులను భారత్ నిలిపివేసింది. అయితే ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు కొరత ఏర్పడింది. ఈ సంక్షోభాన్ని నివారించడానికి, అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న ధరలను అదుపు చేయడానికి అమెరికా ప్రభుత్వం ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను 30 రోజులపాటు తాత్కాలికంగా సడలించింది. ఈఅవకాశాన్ని అందిపుచ్చుకున్న రిలయన్స్, నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీతో ఈ భారీ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ఆర్థికంగానూ, సాంకేతికంగానూ రిలయన్స్‌కు ఎంతో లాభదాయకం. ఇరాన్ ముడి చమురు నాణ్యత జామ్‌నగర్ రిఫైనరీలోని అత్యాధునిక యంత్రాలకు అత్యంత అనుకూలంగా ఉంటుంది. దీనివల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ఇంధనాన్ని ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 110 నుండి 120 డాలర్ల మధ్య ఉండగా, రిలయన్స్ సుమారు 7 డాలర్ల ప్రీమియంతో ఈ డీల్ కుదుర్చుకున్నట్లు సమాచారం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా చమురుపై భారత్ ఏ విధంగా ఆధారపడిందో, ఇప్పుడు ఇరాన్ చమురు దిగుమతుల పునఃప్రారంభం ద్వారా భారత్ తన ఇంధన వనరులను వివిధ దేశాల నుంచి దిగుమతులు చేసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇది కేవలం రిలయన్స్‌కే కాకుండా, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల స్థిరీకరణకు కూడా పరోక్షంగా దోహదపడే అవకాశం ఉంది.




## సౌతాఫ్రికా టూరుకు హర్మన్‌ప్రీత్ సేన ఎంపిక



వచ్చే నెలలో సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లే భారత మహిళల క్రికెట్ జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. టీ20 సిరీస్‌కు 15 మందితో కూడిన జట్టును ఎంపిక చేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆల్‌రౌండర్ అనుష్క శర్మ తొలిసారిగా జాతీయ జట్టుకు ఎంపికైంది. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో ఆకట్టుకోవడంతో ఆమె పిలుపు అందుకుంది. అలాగే, ఫాస్ట్ బౌలర్ కాశ్వీ గౌతమ్ కూడా తొలిసారిగా టీ20 జట్టుకు సెలెక్ట్ అయ్యింది. ఆమె వన్డే, టెస్టుల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌కు దూరంగా ఉన్న వికెట్ కీపర్ ఉమా ఛెత్రి తిరిగి పొట్టి జట్టులో చోటు సంపాదించింది. అయితే, వైష్ణవి శర్మ, స్నేహ్ రాణా, కమలిని, అమన్‌జోత్ కౌర్ ఈ టూరుకు ఎంపిక కాలేదు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా ఏప్రిల్ 17న తొలి టీ20 జరగనుంది.19,22, 25, 27 తేదీల్లో మిగతా మ్యాచ్‌లు జరుగుతాయి. జూన్‌లో జరగబోయే టీ20 వరల్డ్ కప్‌కు ఈ సిరీస్ భారత్‌కు సన్నాహకంగా ఉపయోగపడనుంది.

## రూ.15 వేల కోట్లకు రాజస్థాన్ రాయల్స్.. ఐపీఎల్ చరిత్రలోనే అతిపెద్ద డీల్!

ఐపీఎల్ ఫ్రాంచైజీ 'రాజస్థాన్ రాయల్స్' రికార్డు ధరకు అమ్ముడుపోయింది. అమెరికాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కల్ సొమానీ నేతృత్వంలోని కన్సార్టియం సుమారు



1.63 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 15,300 కోట్లు) ఈ జట్టును కొనుగోలు చేసినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. కల్ సొమానీ కన్సార్టియానికి వాల్‌మార్ట్ కుటుంబానికి చెందిన 'రాబ్ వాల్టన్', అలాగే 'హాంప్' కుటుంబం ఆర్థిక దన్నుగా నిలిచాయి. ఈ డబ్బు మొత్తాన్ని వారు ఒకేసారి చెల్లించనున్నట్లు తెలిసింది. రాబోయే ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత ఈ కొనుగోలు ఒప్పందం అధికారికంగా అమల్లోకి రానున్నట్లు సమాచారం. ఇప్పటివరకు మనోజ్ బదాలేకు చెందిన 'ఎమర్జింగ్ డియా వెంచర్స్' చేతిలో రాయల్స్ మెజారిటీ (65 శాతం) వాటా ఉంది. తాజా విక్రయంతో అది చేతులు మారనుంది. ఇక, ఐపీఎల్ చరిత్రలో ఇదే అతిపెద్ద డీల్ అని నిపుణులు చెబుతున్నారు. గత ఏడాది గుజరాత్ టాన్స్‌లో 67 శాతం వాటాను టొరెంట్ గ్రూప్ రూ. 5,025 కోట్లకు కొనుగోలు చేయగా, దాన్ని దాటేస్తూ రాయల్స్ ఏకంగా రూ.15 వేల కోట్లకు పైగా పలకడం గమనార్హం. ఆదిత్య బిర్లా గ్రూప్ (డేవిడ్ బ్లిట్జర్‌తో కలిసి), ఆర్సెలర్ మిట్టల్ వంటి బడా సంస్థలు ఈ ఫ్రాంచైజీ కోసం పోటీ పడినప్పటికీ అంతిమంగా సొమానీ కన్సార్టియం దక్కించుకుందని తెలిసింది.

## కెప్టెన్లపైనే ఢిల్లీ, పంజాబ్ ఆశలు

### విదేశీ ఆటగాళ్ల రాకపై తొలగని ఉత్కంఠ



మరో మూడ్రోజుల్లో ఐపిఎల్ సీజన్-19 ప్రారంభం కానుండగా.. ఐపిఎల్‌లో ఆడే విదేశీ ప్లేయర్లకు ఆయా దేశాల క్రికెట్‌బోర్డులు 'నో అబ్జక్షన్ సర్టిఫికెట్'(ఎన్‌ఒసి)లు ఇంకా మంజూరు చేయలేదు. ఇందుకు ప్రధాన కారణం యుద్ధం కారణంగా భారత్‌కు విమాన సర్వీసులు సజావుగా లేకపోవడమే. క్రికెట్ ఆస్ట్రేలియా(సిఎ) ఇప్పటివరకు ఏ ఒక్క ఆటగానికీ ఎన్‌ఒసి మంజూరు చేయలేదు. తాజాగా ఇంగ్లండ్ ఆటగాడు, ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ బెన్ డకెట్ ఈ సీజన్ ఐపిఎల్ నుంచి వైదొలుగుతున్నట్లు మంగళవారం ప్రకటించాడు. ఐపిఎల్ నుంచి వైదొలిగి కౌంటీ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనాలని నిర్ణయించుకోవడమే ఇందుకు ప్రధానం. దీంతో అతనిపై మూడేళ్ల నిషేధం పడే అవకాశం ఉంది. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ ప్రధాన పేస్ అస్త్రం మిచెల్ స్టార్క్ కూడా ఇంకా జట్టుతో చేరలేదు. ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్ హేమంగ్ బదానీ ఇదే విషయాన్ని స్పష్టం చేశాడు. ఉఆసీస్ బోర్డు నుంచి ఎన్‌ఒసి కోసం మేం ఎదురుచూస్తున్నాం. అది వస్తే స్టార్క్ ఎప్పటి నుంచి అందుబాటులో ఉండేది చెప్పగలం. ఈ మేరకు సిఎతో సంప్రదింపులు జరుపుతున్నాం" అని తెలిపాడు. 2014, 2025 రన్నరప్ పంజాబ్ కింగ్స్ 18ఏళ్లలో ముచ్చటగా మూడుసార్లు మాత్రమే ప్లే-ఆఫ్స్‌కు చేరింది. గత ఏడాది శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో అనూహ్య ప్రదర్శనతో ఫైనల్‌కు చేరినా.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) చేతిలో ఓడి మరోసారి రన్నరప్‌కే పరిమితమైంది. 2008 ఐపిఎల్ తొలి సీజన్లో టాప్-4లో నిలిచిన పంజాబ్.. ఆ తర్వాత 2014 వరకు లీగ్ దశ దాటలేదు. ఆ ఏడాది మ్యాక్స్‌వెల్ విధ్వంస ప్రదర్శనతో తొలిసారి ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచింది. మళ్లీ గ్రూప్ దశ దాటడానికి దశాబ్దంపైనే పట్టింది. 2024లో శిఖర్ ధావన్‌ను సారథిగా తప్పించిన పంజాబ్.. జట్టు ప్రక్షాళనను మొదలుపెట్టింది. 2025లో ఏకంగా రూ.26.75 కోట్లతో శ్రేయస్ అయ్యర్‌ను కొనుగోలు చేసి కెప్టెన్సీ బాధ్యతలను అప్పగించింది. ఈ క్రమంలోనే రికీ పాంటింగ్‌కు కోచ్ పదవికి ఎంపిక చేసింది. ఈ మార్పులతో ఆ ఫ్రాంచైజీ మంచి ఫలితమే రాబట్టి ఫైనల్ చేరింది. కానీ ఫైనల్ మెట్టుపై బోల్తా పడి తొలిసారి కప్ కొట్టాలని కలను మరోసారి భగ్నం చేసుకుంది.

## లైంగిక వేధింపుల కేసు ఎఫెక్ట్..

### యశ్ దయాల్‌కు బిగ్ షాక్ ఇచ్చిన ఆర్సీబీ



లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బౌలర్ యశ్ దయాల్ విషయంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్-2026 మొత్తానికి అతన్ని దూరంపెట్టింది. వ్యక్తిగత కారణాలతో అతను ఈ సారి లీగ్‌కు అందుబాటులో ఉండటం లేదని ఆర్సీబీ క్రికెట్ డైరెక్టర్ మో బోబాట్ మంగళవారం వెల్లడించారు. 'యశ్ జట్టులో చేరడని కన్ఫార్మ్ చేస్తున్నా. అతను ప్రస్తుతం వ్యక్తిగత సమస్యను ఎదుర్కొంటున్నాడు. ఇప్పటివరకూ మేము అతనికి మద్దతుగానే ఉన్నాం. అతన్ని రిన్ చేసుకోవడమే అందుకు నిదర్శనం. ఈ సీజన్‌కు దూరంగా ఉన్నా అతను మా కాంట్రాక్ట్‌లోనే ఉంటాడు. అతనితో రెగ్యులర్‌గా మాట్లాడుతున్నాం. నేను ఈ రోజు కూడా మాట్లాడా. కానీ, ఈ సమయంలో అతను జట్టులో చేరడం అతనికి, ఫ్రాంచైజీకి మంచిది కాదని భావించాం. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం.'అని బోబాట్ తెలిపారు. 2024, 2025 సీజన్లలో ఆర్సీబీకి ఆడిన యశ్ దయాల్ ఆ జట్టు బౌలింగ్ ఎటాక్‌లో కీలకంగా మారాడు. గతేడాది బెంగళూరు తొలి టిల్ గెలవడంలో అతను కీలక పాత్ర పోషించాడు. 15 మ్యాచ్‌ల్లో 13 వికెట్లు తీశాడు. యశ్ దయాల్ లైంగిక వేధింపుల కేసుల్లో ఇరుక్కున్న విషయం తెలిసిందే. క్రికెట్ కెరీర్ చూపిస్తానంటూ లైంగిక దాడికి పాల్పడ్డాడని రాజస్థాన్‌కు చెందిన ఓ మైనర్ అతనిపై కేసు పెట్టింది. గాజియాబాద్‌కు చెందిన ఓ యువతి కూడా యశ్‌పై లైంగిక ఆరోపణలు చేసింది.

## చివరి నిమిషంలో అలా జరిగితే చాలా కష్టం



టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ ఐపీఎల్‌లో కీలక ఆటగాళ్లు పాల్గొనే విషయంలో నెలకొన్న అనిశ్చితిపై కీలకమైన వ్యాఖ్యలు చేశాడు. మిచెల్ స్టార్క్ దిల్లీ క్యాపిటల్స్‌కు ఆడే విషయంలో సందిగ్ధత నెలకొంది. దీనిపై గంగూలీ స్పందించాడు. 'అది నిజంగా బాధిస్తుంది. నాణ్యమైన ఆటగాళ్లు చివరి నిమిషంలో జట్టుకు దూరమైతే.. టీమ్ బ్యాలెన్స్ ద అది ప్రభావం చూపిస్తుంది' అని అన్నాడు. 'భారత జట్టును తయారుచేయడం కంటే.. ఐపీఎల్ జట్టును రూపొందించడమే చాలా కష్టం. ఎందుకంటే భారత జట్టుకు అత్యున్నత ఆటగాళ్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారు. ఐపీఎల్‌లో 10 జట్లున్నాయి. నాణ్యమైన క్రికెటర్లు పాల్గొనకుంటే జట్టు సమతూకం దెబ్బతింటుంది' అని సౌరభ్ గంగూలీ విశ్లేషించాడు. 'జట్టుకు ఎవరైనా ఆటగాడు దూరమైనప్పుడు ప్రత్యామ్నాయ క్రికెటర్ల లభ్యత ఇబ్బంది పెడుతుంది. ఐపీఎల్‌కు మిచెల్ స్టార్క్, పతిరన దూరమైతే.. ఆ లోటును పూరించడం చాలా కష్టం' అని గంగూలీ అన్నాడు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌పైనా అతడు మాట్లాడాడు. 'పనిభారం నిర్వహణ చాలా ముఖ్యం. ఎందుకంటే ఆటగాళ్లు చాలా క్రికెట్ ఆడతారు. శారీరక శ్రమ కంటే, మానసిక అంశమే ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇంటికి, కుటుంబాలకు దూరంగా ఉండటం ఎప్పుడూ సులభం కాదు' అని సౌరభ్ గంగూలీ పేర్కొన్నాడు.

## ఆర్‌సిబికి కొత్త యాజమాన్యం!



ఐపీఎల్, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ రెండింటిలోనూ బలమైన బ్రాండ్ వాల్యూ కలిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు యాజమాన్యం అధికారికంగా చేతులు మారింది. గత 18 ఏళ్లుగా ఈ జట్టును నడిపిస్తున్న యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ ఫ్రాంచైజీని విక్రయించాలని నిర్ణయించుకుంది. ప్రముఖ భారతీయ పారిశ్రామిక దిగ్గజం ఆదిత్య బిర్లా గ్రూప్ నేతృత్వంలోని కన్సార్టియం సుమారు 1.78 బిలియన్ డాలర్ల (సుమారు 16,732 కోట్లు) భారీ ధరకు ఈ జట్టును సొంతం చేసుకుంది. ఈ కన్సార్టియంలో ఆదిత్య బిర్లా గ్రూప్‌తో పాటు మ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్, యూఎస్ స్పోర్ట్స్ ఇన్వెస్టర్ డేవిడ్ బ్లిట్జర్, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ బ్లాక్‌స్టోన్ భాగస్వాములుగా ఉన్నాయి. ఇది ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఫ్రాంచైజీ డీల్‌గా రికార్డులకు ఎక్కింది. ఈ భారీ మార్పు తర్వాత జట్టు నిర్వహణలో కూడా కొత్త నాయకత్వం రానుంది. ఆదిత్య బిర్లా గ్రూప్ డైరెక్టర్, మాజీ ప్రొఫెషనల్ క్రికెటర్ అయిన ఆర్యమాన్ విక్రమ్ బిర్లా (కుమార మంగళం బిర్లా కుమారుడు) ఈ ఫ్రాంచైజీకి నూతన చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఇంటర్నెట్ చైర్మన్ సత్యన్ గజ్వాని వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడతారు. ఈ కొనుగోలు ఒప్పందం ప్రకారం కేవలం పురుషుల టీమ్ మాత్రమే కాకుండా, మహిళల డబ్ల్యూపీఎల్ టీమ్ బాధ్యతలు కూడా ఈ కొత్త యాజమాన్యానికే దక్కుతాయి. అయితే, ఈ మార్పులు వెంటనే అమలులోకి రావు. ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత పూర్తి స్థాయి యాజమాన్య బదిలీ జరుగుతుంది. యునైటెడ్ స్పిరిట్స్ సంస్థ తన ప్రధాన వ్యాపారమైన మద్యం రంగంపై పూర్తి దృష్టి పెట్టాలని భావించడం, మరోవైపు ఆదిత్య బిర్లా గ్రూప్ వంటి దేశీయ దిగ్గజాలు క్రీడా రంగంలోకి ప్రవేశించాలని ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా విరాట్ కోహ్లీ వంటి స్టార్ ప్లేయర్ వల్ల ఉన్న విపరీతమైన క్రేజ్, 2024, 2025 సీజన్లలో ఈ జట్టు వరుసగా టిల్స్ గెలవడంతో జట్టు విలువ విపరీతంగా పెరిగింది. అందుకే ఈ స్థాయిలో భారీ ధర పలికింది. ఈ కొత్త యాజమాన్యం రాకతో జట్టుకు మరింత ఆర్థిక బలం చేకూరుతుందని, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని క్రికెట్ విశ్లేషకులుభావిస్తున్నారు.

# వృదయం సినిమా

MOVIE TIME!

## బాలకృష్ణకు లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డు



ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఢిల్లీ 2026లో శ్రీ నందమూరి బాలకృష్ణ గార్కి "లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డు" (జీవన సాఫల్య పురస్కారం) లభించడం, ఆ పురస్కారాన్ని ఢిల్లీ గౌరవ ముఖ్యమంత్రి శ్రీమతి గుప్తా రేఖ గారి చేతుల మీదుగా వారు అందుకోవడం మాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో శ్రీ నందమూరి బాలకృష్ణ గారి ప్రస్థానంలో ఇది మరొక మైలురాయి మాత్రమే కాదు, తెలుగు సినీ పరిశ్రమకే ఇది గర్వకారణం. ఈ సందర్భంగా, శ్రీ నందమూరి బాలకృష్ణ గార్కి మా హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్నాము. భవిష్యత్తులో శ్రీ నందమూరి బాలకృష్ణ గారు మరిన్ని అవార్డులు అందుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము.

ఇట్లు
భవదీయులు

(టి. ప్రసన్న కుమార్) గౌరవ కార్యదర్శి
(వై.వి.ఎస్. చౌదరి) గౌరవ కార్యదర్శి

## మధ్యతరగతి కుటుంబ కథే
# కార్మేని సెల్వం



పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగ రాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వం లో తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రం థియేటర్స్ లోకి రాబోతుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ సినిమాపై ఆసక్తిని పెంచగా.. గురువారం ట్రైలర్ ను రిలీజ్ చేశారు. ప్రస్తుత ట్రెండ్‌కు కనెక్ట్ అయ్యే విధంగా ఫ్యామిలీ ఎమోషన్స్‌తో విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్ లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సముద్రఖనితో వర్క్ చేసిన తెలుగు డైరెక్టర్స్ 'విమానం' ఫేమ్ శివ ప్రసాద్, 'రామం రాఘవం' ఫేమ్ ధనరాజ్, 'సేవ్ ద టైగర్స్' ఫేమ్ తేజ కాకుమాను అతిథులుగా హాజరయ్యారు.



## బాలయ్యకు జీవిత సాఫల్య పురస్కారం



అంతర్జాతీయ ఢిల్లీ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్‌డి) 2026లో భాగంగా తెలుగు సినీ దిగ్గజం, లెజెండరీ నటుడు నందమూరి బాలకృష్ణకు జీవిత సాఫల్య పురస్కారం లభించింది. ఐదు దశాబ్దాల అసాధారణ సినీ వారసత్వాన్ని, చిత్ర పరిశ్రమకు చేసిన సేవలకు గుర్తుగా ప్రతిష్టాత్మకమైన భరత్ మండపంలో జరిగిన అంతర్జాతీయ ఢిల్లీ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్‌డి) 2026లో తెలుగు సినిమా దిగ్గజం నందమూరి బాలకృష్ణకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. 50 ఏళ్ల ప్రస్థానంలో భారతీయ సినిమాకు ఆయన చేసిన అపారమైన సేవకు గుర్తింపుగా, నటన కళ పట్ల ఆయనకున్న చెరగని ప్రభావం, బహుముఖ ప్రజ్ఞ, అసమానమైన అంకితభావానికి నివాళిగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. మార్చి 25న న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమానికి నందమూరి బాలకృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చిత్ర, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖుల సమక్షంలో ఢిల్లీ గౌరవ ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

అనిల్ రావిపూడితో బాలకృష్ణ చేసిన 'భగవంత్ కేసరి' 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాలలో తెలుగులో ఉత్తమ చలనచిత్రంగా అవార్డుని సాధించిన సంగతి తెలిసిందే. ఇక ఈ చలనచిత్రోత్సవ కార్యక్రమంలో ఈ మూవీని ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ ప్రత్యేక ప్రదర్శనలో నటసింహం నందమూరి బాలకృష్ణ, చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి పాల్గొన్నారు. ఈ ప్రదర్శన అనంతరం..

నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ .. 'ప్రప్రథమంగా మా అమ్మనాన్నలకు ప్రణామాలు. వారి ఆశీర్వాదం లేకపోతే నేను ఇక్కడి వరకు వచ్చేవాడిని కాదు. వారి ఆశీర్వాదం వల్లే నేను చిత్ర సీమలో యాభై ఏళ్లుగా రాణిస్తూనే ఉన్నాను. ఇతర ఏ భాషలోనూ, ఏ ఇండస్ట్రీలోనూ ఇలా యాభై ఏళ్ల పాటు హీరోగా రాణిస్తున్న వ్యక్తి లేరని నేను గర్వంగా చెప్పగలను. మహిళల గురించి, మహిళల సాధికారత గురించి మా నాన్న గారు ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండేవారు. తండ్రి ఆస్తిలో మహిళలకు వాటాని కల్పించే చట్టాన్ని ఆయన మొదటగా తీసుకు వచ్చారు. తిరుపతిలో పద్మావతి యూనివర్సిటీ స్థాపించారు. మా నాన్న గారు సినిమాల్లో ఉన్నా, రాజకీయాల్లో ఉన్నా మహిళా సాధికారత గురించి పాటు పడ్డారు. ఆయన వారసత్వాన్ని, ఆయన ఆశయాల్ని మేం కొనసాగిస్తాం. ఆయన ఎప్పుడూ మా గుండెల్లో సజీవంగా ఉంటారు. అంతర్జాతీయ ఢిల్లీ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్‌డి)లో పాల్గొనడం, పురస్కారాన్ని స్వీకరించడం ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమంలో మా 'భగవంత్ కేసరి' సినిమాని ప్రదర్శించడం గర్వంగా ఉంది. మాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు' అని అన్నారు.






# రేసుగుర్రం
## ఏప్రిల్ 8న గ్రాండ్‌గా రీ-రిలీజ్!

టాలీవుడ్‌లో భారీ విజయాన్ని సాధించిన రేసుగుర్రం సినిమా మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రీరిలీజ్ ట్రైలర్ విడుదల అయ్యింది. స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ నటించిన ఈ సినిమా యాక్షన్, కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ కలయికతో అప్పట్లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పటికీ ఈ చిత్రానికి భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఈ ట్రైలర్‌తో మళ్లీ ఆ పాత మాస్ ఫీల్‌ను ప్రేక్షకులు అనుభవించబోతున్నారు. దర్శకుడు సురేందర్ రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రంలో శృతి హాసన్ హీరోయిన్‌గా నటించగా, బ్రహ్మానందం తన కామెడీతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. క్రౌన్ మూవీస్ ద్వారా ఏప్రిల్ 8, 2026న గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ సినిమా, బన్నీ ఫ్యాన్స్‌కు బర్త్‌డే సెలబ్రేషన్స్‌ను మరింత గ్రాండ్‌గా మార్చనుంది. అల్లు అర్జున్ ఎనర్జీ, బ్రహ్మానందం కామెడీ టైమింగ్, థమన్ అందించిన సంగీతం అన్ని కలిసి ఈ సినిమాను మరింత ప్రత్యేకంగా నిలబెట్టాయి. ముఖ్యంగా బ్రహ్మానందం పాత్రకు అప్పట్లో వచ్చిన రెస్పాన్స్ ఇప్పటికీ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూనే ఉంది.

## సుయోధన ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్



ప్రజ్వలా లైన్ క్రియేషన్స్ బ్యానర్ పై ప్రియదర్శి, ద్రిషిక చందర్ హీరో హీరోయిన్ గా డైలాగ్ కింగ్ సాయికుమార్, సీనియర్ హీరోయిన్ ప్రేమ కీలకపాత్రల్లో నటించిన చిత్రం "సుయోధన". వై ఎస్ మాధవ్ రెడ్డి దర్శకత్వం లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని బోసుబాబు నిడుమోలు నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతోంది. పలు హిట్ చిత్రాలను రిలీజ్ చేసిన శ్రీ లక్ష్మి పిక్చర్స్ సంస్థ "సుయోధన" సినిమాను విడుదల చేస్తోంది. ఈ రోజు ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో గ్రాండ్ గా నిర్వహించారు.

ఆర్ట్ డైరెక్టర్ బ్రహ్మ కడలి మాట్లాడుతూ నేను ఈ సినిమాలోకి రావడానికి కారణం ఎడిటర్ ఛోటా కె ప్రసాద్. ఆయన ఈ సినిమాకు ఎడిటింగ్ తో పాటు అనేక విషయాల్లో సపోర్ట్ చేస్తూ అండగా నిలిచారు. ఈ మూవీ కోసం మంచి సెట్ వర్క్ చేశాం. అది మూవీ లో చాలా బిగ్ స్పాన్ లో కనిపిస్తుంది. సాయి కుమార్ గారికి, ప్రియదర్శికి తమ కెరీర్ లో ఒక స్పెషల్ మూవీగా "సుయోధన" నిలుస్తుంది. అన్నారు.

## పాపం ప్రతాప్
# మాములు హిట్ అవదు



టాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ తిరువీర్ ప్రధాన పాత్రలో, ఎస్.పి. దుర్గ నరేష్ దర్శకత్వంలో రూపొందిన వైవిధ్యభరిత చిత్రం 'పాపం ప్రతాప్'. కృషి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మదిరెడ్డి సంయుక్తంగా నిర్మించారు. వరుస బ్లాక్ బస్టర్స్‌తో ఆడియన్స్‌ను అలరిస్తున్న ఈటీవి విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ నుంచి రాబోతున్న ఈ సినిమా నుంచి రీసెంట్‌గా రిలీజైన టీజర్‌కు మంచి అప్లాజ్ వస్తోంది. ఇప్పటివరకు ప్రేమలో గెలిచాం.. పెళ్లి తర్వాత ఆ ప్రేమ ఎలా ఉంటుందో చూద్దాం అనుకుంటున్న ఓ జంట చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందింది. 'రేపటి నుంచి మీ ఇద్దరి మధ్య ఏ గొడవైనా జరిగినా.. ఆ గొడవ వల్ల నా పరువు పోయినా.. గుర్తుపెట్టుకో నీ బతుకు నా చేతిలో చేతబడి బొమ్మేరోయ్' అంటూ హీరో తండ్రి డైలాగ్‌తో ఆసక్తికరంగా టీజర్ ఉంది. థియేటర్లలో ఫన్ రైడ్ చేయించే ఈ నవ్వుల బ్లాక్ బస్టర్‌ను ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో చిత్ర యూనిట్ పాల్గొని సినిమా విశేషాలను పంచుకుంది.

# ఇరుముడి 50 శాతం పూర్తి



మాస్ మహారాజా రవి తేజ ప్రస్తుతం తన 'ఇరుముడి' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రానికి శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రతిష్టాత్మక పాన్‌ఇండియన్ పవర్‌హౌస్ మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ భారీ ఎత్తున నిర్మిస్తోంది. మేకర్స్ ఇప్పటికే రవి తేజ, ప్రియా భవానీ శంకర్‌ల ఫస్ట్ లుక్‌ను పోస్టర్‌ను విడుదల చేసి అందరిలోనూ క్యూరియాసిటీని పెంచేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోండగా ఇప్పటికే 50% షూటింగ్ పూర్తయిందని మేకర్స్ ప్రకటించారు. ప్రస్తుతం చిత్ర బృందం హైదరాబాద్‌లో హైఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలను షూట్ చేస్తోంది. అనల్ అరసు, రియల్ సతీష్ స్టంట్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ అందిస్తున్నారు. ఇటీవలి కాలంలో చూడనటువంటి అత్యంత అద్భుతమైన ఫైట్‌లను ప్రేక్షకులు చూడబోతున్నారని టీం చెబుతోంది.

యాక్షన్ ప్రధాన ఆకర్షణగా ఉన్నప్పటికీ 'ఇరుముడి'లో అద్భుతమైన కథ, కాన్సెప్ట్ ఉంటుంది. అయ్యప్ప స్వామి, అయ్యప్ప మాల నేపథ్యంలో సాగే ఈ కథలో ఓ అందమైన కుటుంబం, ఫ్యామిలీ ఎమోషన్స్ అద్భుతంగా ఉండబోతోన్నాయని మేకర్స్ వదిలిన పోస్టర్స్, కంటెంట్ చెబుతోంది. దర్శకుడు శివ నిర్వాణ ఒక కమర్షియల్ ఎంటర్‌టైనర్‌కు అవసరమైన అన్ని అంశాలను, బలమైన భావోద్వేగ ప్రధానాంశంతో సమతుల్యం చేస్తూ ఒక అద్భుతమైన స్క్రిప్ట్‌ను రూపొందించారు.

రవి తేజ తాను ఇంతకు ముందు పోషించిన పాత్రలన్నింటిలోనూ భిన్నమైన పాత్రను 'ఇరుముడి'లో పోషిస్తున్నారు. ఈ చిత్రంలో తన కుమార్తెగా నటించిన బేబీ నక్షత్రతో రవి తేజకు ఉన్న బంధాన్ని చూపిస్తూ, చిత్ర బృందం ఒక అందమైన, ఆకట్టుకునే పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో రవి తేజ వింటేజ్, విలేజ్, మాస్ లుక్‌లో కనిపిస్తున్నారు. సాధారణ చెక్డ్ షర్ట్, లుంగీ ధరించి తన కుమార్తెతో కలిసి నడుస్తూ ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. ఈ పోస్టర్‌ను చూస్తుంటే తండ్రీకూతుళ్ల మధ్య మంచి ఎమోషనల్ సీన్లను సినిమాలో చూపించేలా ఉన్నారనిపిస్తోంది.

సాయి కుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక వంటి అద్భుతమైన ఆర్టిస్టులు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. నిర్మాతలైన నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ ప్రాజెక్ట్‌ను భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. జివి ప్రకాష్ కుమార్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణలలో ఒకటిగా నిలవనుంది. ఈ మూవీకి విష్ణు శర్మ సినిమాటోగ్రఫర్‌గా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా పని చేస్తున్నారు. శివ నిర్వాణ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించగా, నరేష్ బాబు పి స్క్రిప్ట్ కో ఆర్డినేటర్‌గా వర్క్ చేస్తున్నారు.

# నాగబంధం
## జూలై 3న గ్రాండ్ రిలీజ్



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియన్ మైథలాజికల్ ఎపిక్ చిత్రం 'నాగబంధం'. నిక్ స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ బ్యానర్లపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా జూలై 3న విడుదల చేయాలని మేకర్స్ ఫిక్స్ అయ్యారు. వర్షాకాలం ప్రారంభంలోనే విడుదల చేయాలని చిత్ర బృందం నిర్ణయించుకుంది.

ఈ మేరకు విడుదల తేదీ పోస్టర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో రెండు రకాల గెటప్స్‌లో హీరో కనిపిస్తున్నారు. పై భాగంలో శివుడిగా హీరోగా పవర్ ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఇక కింది భాగంలో మోడ్రన్ లుక్‌లో చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఈ రెండు లుక్స్‌తో డిజైన్ చేసిన పోస్టర్ ఆడియెన్స్‌లో మరింత క్యూరియాసిటీని పెంచేస్తోంది. శివుడిగా విరాట్ లుక్‌కి ఇప్పటికే అదిరిపోయే రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఈ పోస్టర్ అయితే నెక్స్ట్ లెవెల్లో ఉంది.

ఈ చిత్రం ఇప్పటికే ఆడియెన్స్‌లో భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. ఫస్ట్ గ్లింప్స్, భక్తి గీతం 'నమో రే' ఇప్పటికీ యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతూనే ఉంది. ఇక రిలీజ్ డేట్‌ను ఫిక్స్ చేయడంతో టీం ప్రమోషన్స్ మీద ఫోకస్ పెట్టనుంది. ఇకపై వరుస అప్డేట్లతో ప్రేక్షకుల్లో మరింత బజ్‌ను పెంచేలా టీం ప్లాన్ చేస్తోంది.



## కిల్లింగ్ లుక్స్‌తో కియారా

హిందీ సినిమాల ద్వారా కెరీర్‌ను ప్రారంభించిన కియారా అద్వానీ అక్కడ మంచి గుర్తింపు సంపాదించుకున్న తర్వాత టాలీవుడ్ వైపు అడుగులు వేసింది. ఈమె సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా తెరకెక్కిన 'భరత్ అనే నేను' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది.

ఈ మూవీ మంచి విజయం సాధించింది. ఆ తర్వాత తక్కువ కాలంలోనే రామ్ చరణ్ తో కలిసి నటించిన 'వినయ విధేయ రామ' చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ సినిమా భారీ డిజాస్టర్‌గా నిలిచింది. ఈ మూవీ తర్వాత ఈమె తెలుగులో చాలా కాలం పాటు సినిమాలు చేయలేదు. అలా చాలా ఏళ్ల గ్యాప్ తర్వాత మరోసారి రామ్ చరణ్ హీరోగా రూపొందిన 'గేమ్ చేంజర్' చిత్రంలో హీరోయిన్గా నటించింది.

సినిమాల్లో ఇప్పటికే అనేక సార్లు తన అందాలతో ప్రేక్షకులను అలరించిన ఈ నటి సోషల్ మీడియాలో కూడా ఏమాత్రం తగ్గడం లేదు. తాజాగా ఈమె తనకు సంబంధించిన కొన్ని ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. అందులో ఈ బ్యూటీ బ్రౌన్ కలర్‌లో పొడవాటి టైట్ స్టైల్ గౌన్ ధరించి ఎంతో ఆకర్షణీయంగా నిలబడి స్టిల్స్ ఇచ్చింది.

ఇందులో ఆమె ఒక చేతిని తలపై ఉంచి, తన హెయిర్‌ను ముందుకు వేసి కిల్లింగ్ లుక్స్ తో ఆకట్టుకుంటోంది. ఈమె ధరించిన నెక్లెస్ ఆమె అందాన్ని మరింతగా పెంచింది. ఈ ఫోటోలలో ఈ బ్యూటీ ఎద అందాలు ఫోకస్ అయ్యేలా స్టిల్స్ ఇవ్వడంతో, ఒక్కసారిగా ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.